నేటినిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ | శనివారం 25-1-2020 | RNI No.52865/93·Postal No\.H/SD/258/2018-20 | ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 | సంపుటి :26 | సంచిక: 154 | పేజీలు:4 | వెల: రూ.1/-

నేడు మల్లేపల్లి ఐటిఐలో జాబ్‌మేళా

హైదరాబాద్,జనవరి24(ఆర్ఎన్ఎ): నిరుద్యోగ యువతకు ప్రైవేట్ రంగంలో ఉద్యోగావకాశాలు కల్పించేందుకు ఈనెల 25న శనివారం జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు హైదరాబాద్ జిల్లా ఉపాధి కల్పనాధికారి లక్ష్మణ్‌కుమార్ తెలిపారు. విజయ్‌నగర్‌కాలనీలోని మల్లేపల్లి బాలుర ఐటీఐ క్యాంపస్‌లోని జిల్లా ఉపాధి కల్పనాధికారి కార్యాలయంలో ఈ మేళా జరుగుతుందని తెలిపారు. 7 కంపెనీలు పాల్గొంటుండగా, 400 ఉద్యోగాలు భర్తీ చేపట్టనున్నామన్నారు. అపోలో ఫార్మసీ, క్విస్ కార్పొరేషన్ ప్రైవేట్ లిమిటెడ్, ఐడీబీఐ ఫెడరేల్, ఎల్ఐసీ లిమిటెడ్, వసంత టూల్‌క్రాఫ్ట్ ప్రైవేట్ లిమిటెడ్, ఇన్నోవ్‌సోర్స్ ప్రైవేట్ లిమిటెడ్, గూగుల్ పే, ఆర్ఎస్ బిజినెస్ సపోర్ట్ సొల్యూషన్స్ కంపెనీల్లో ఉద్యోగాలను భర్తీ చేయనున్నామన్నారు. ఎస్సెస్సీ, ఇంటర్, ఐటీఐ(కార్పెంటర్), డిఎ÷-లొమా, బీఫార్మసీ, ఎంఫార్మసీ, బీకాం, బీఏ, ఎంబీఏ, బీటెక్ చదివిన 19-30 ఏండ్ల మధ్య వయస్కులు అర్హులని తెలిపారు. ఎంపికైన వారికి రూ. 10వేల నుంచి 20వేల వరకు వేతనంగా ఇవ్వబడుతుందని, ఆసక్తి గల వారు తమ సర్టిఫికెట్లతో సహా జాబ్‌మేళాకు హాజరుకావాలన్నారు. ఇతర వివరాలకు సెల్ : 82476 56356 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

బాలపురస్కారాలను స్వీకరించిన చిన్నారులతో ఢిల్లీలో ప్రధాని నరేంద్ర మోదీ భేటీ అయిన దృశ్యం

ఇంత చిన్న వయసులో ఇన్ని సాహసాలా

ఇవే రేపటి మంచి పనులకు ప్రేరణ

బాలపురస్కార గ్రహీతలతో ప్రధాని మోడీ

న్యూఢిల్లీ,జనవరి24(ఆర్ఎన్ఎ): ఇంత చిన్న వయసులో నమ్మశక్యం కాని పనులు చేసినందుకు మిమ్మల్ని చూసి ఆశ్చర్యపోతున్నానని ప్రధాని మోడీ పేర్కొన్నారు. 2020 సంవత్సరానికి గానూ ప్రధానమంత్రి బాలపురస్కారాలను స్వీకరించిన చిన్నారులతో ప్రధాని నరేంద్ర మోదీ ఢిల్లీలో సంభాషించారు. ఈ సందర్భంగా మోదీ మాట్లాడుతూ.. క్లిష్ట పరిస్థితుల్లో చేసిన సాహసాలు భవిష్యత్‌లో మంచి పనులు చేసేందుకు ప్రేరణను ఇస్తాయన్నారు. వారి నుంచి తాను ప్రేరణను, శక్తిని పొందుతున్నట్లు ప్రధాని తెలిపారు. సమాజానికి, దేశానికి సేవ చేయాలన్న వారి తపనను చూసి గర్విస్తున్నట్లు ప్రధాని మోదీ ప్రశంసించారు. విద్యార్థులంతా దేశానికి సేవ చేయాలన్న భావనతో ముందుకు సాగాలని ఆయన పిలుపునిచ్చారు. మీరు(విద్యార్థులు) ఇతర రకాలైన అలవాట్లను అలవర్చుకోరాదని నేను కోరుకుంటున్నాను. ఇప్పటి వరకు సాధించింది ఏమీ లేదని గుర్తిస్తూ ముందుకు సాగాలన్నారు. తాను ఇంకా చాలా చేయాలి, దేశానికి చాలా ఇవ్వాలి అనే భావనను తమకు తాముగా ఏర్పర్చుకుని ముందుకు సాగితే మీకు చాలా ఆనందం కల్గుతుంది. ఆ భావన నుంచి కొత్త విషయాలను నేర్చుకునే అవకాశం లభిస్తుంది. చిన్నప్పుడు మనం నేర్చుకునే అలవాట్లు జీవితాంతం పనికి వస్తాయి. ఆ అలవాట్లే మనసులో స్థిరపడిపోతాయి అని మోదీ తెలిపారు.

నేడు మున్సిపల్ ఎన్నికల కౌంటింగ్

9కార్పొరేషన్లు, 120 మున్సిపాలిటీల్లో ఓట్ల లెక్కింపు

ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు

ఉదయం 8గంటలకు ఓట్ల లెక్కింపు మొదలు

సాయంత్రానికల్లా ఫలితాల ప్రకటన

రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ నాగిరెడ్డి

హైదరాబాద్,జనవరి24(ఆర్ఎన్ఎ): రాష్ట్రంలో శనివారం మున్సిపల్ ఎన్నికల కౌంటింగ్ చేపట్టనున్నారు. ఈ మేరకు రాష్ట్ర ఎన్నికల సంఘం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. 9 కార్పొరేషన్లు, 120 మున్సిపాలిటీ ల్లో ఓట్ల లెక్కింపునకు సంబంధించిన అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ నాగిరెడ్డి స్పష్టం చేశారు. 25వ తేదీ సాయంత్రానికి నగరపాలక, మున్సిపల్ ఫలితాలు వస్తాయని ఆయన తెలిపారు. ఓట్ల లెక్కింపునకు సంబంధించి మార్గదర్శకాలు విడుదల చేశామని తెలిపారు. ఈ నెల 27న మేయర్లు, ఛైర్‌పర్సన్ల ఎన్నికకు పరోక్ష ఎన్నిక ఉంటుందని ఎస్ఈసీ చెప్పారు. ఈ నెల 29న కరీంనగర్ మేయర్ ఎన్నిక ఉంటుందన్నారు.రాజకీయ పార్టీలు మేయర్, ఛైర్‌పర్సన్ల పేర్లను ఏ, బీ ఫారాల ద్వారా ఇవ్వాలని సూచించారు. ఈ నెల 26న ఉదయం 11 గంటల వరకు ఏ ఫామ్, 27న ఉదయం 10 గంటల వరకు బీ ఫామ్ ఇవ్వాలన్నారు. రాజకీయ పార్టీలు తమ విప్‌లను నియమించుకోవచ్చు అని నాగిరెడ్డి సూచించారు. విప్ ఎవరన్నది ఆయా పార్టీలు 26న ఉదయం 11 గంటల వరకు ఇవ్వాల్సి ఉంటుందన్నారు. విప్ జారీ వివరాలను 27 ఉదయం 11:30 గంటల వరకు ఇవ్వాల్సి ఉంటుందని ఆయన చెప్పారు. పరోక్ష ఎన్నికల్లో ఓట్లు సమానంగా వస్తే లాటరీ ద్వారా విజేతను ఎంపిక చేస్తామన్నారు. పరోక్ష ఎన్నిక నేపథ్యంలో శనివారం సాయంత్రం నుంచి ప్రత్యేక ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లో ఉంటుందని నాగిరెడ్డి పేర్కొన్నారు. ఈ నియమావళి సాధారణ ఎన్నికల ప్రవర్తనా నియమావళి లాగే ఉంటుందని నాగిరెడ్డి స్పష్టం చేశారు. మున్సిపాలిటీల్లో 74.40 శాతం పోలింగ్ నమోదు కాగా, కార్పొరేషన్లలో 58.83 శాతం పోలింగ్ నమోదైంది. ఓట్ల లెక్కింపు చేపట్టనున్న నేపథ్యంలో రాష్ట్ర పురపాలక శాఖ డైరెక్టర్ శ్రీదేవితో కలిసి నాగిరెడ్డి మీడియాతో మాట్లాడారు. సాయంత్రానికి అన్ని ఫలితాలు వస్తాయని అన్నారు. పురపాలక శాఖ డైరెక్టర్ శ్రీదేవి మాట్లాడుతూ మేయర్, మున్సిపల్ ఛైర్మన్ ఎన్నికలో ఎక్స్‌అఫీషియో సభ్యులకు కూడా ఓటు హక్కు ఉంటుందన్నారు. శాసనసభ నియోజకవర్గ పరిధిలో ఒకే మున్సిపాలిటీ ఉంటే స్థానిక ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు ఎక్స్‌అఫీషియో హోదాలో అక్కడే ఓటు వేయాలని.. ఒకటి కంటే ఎక్కువ మున్సిపాలిటీలు ఉంటే వారు ఆప్షన్ ఇవ్వాల్సి ఉంటుందని చెప్పారు. ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎక్స్ ఆఫీషియో కోసం ఆప్షన్ ఇవ్వాల్సి ఉంటుందని శ్రీదేవి తెలిపారు. ఎక్స్‌ఆఫీషియో సభ్యత్వం కోసం శనివారం సాయంత్రం వరకు ఆప్షన్ ఇవ్వొచ్చు అని ఆమె సూచించారు. ఆప్షన్ల విషయమై మున్సిపల్ కమిషనర్లకు ఇప్పటికే ఆదేశాలు ఇచ్చామని శ్రీదేవి పేర్కొన్నారు.

మున్సిపోల్స్‌లో టిఆర్ఎస్‌కే అవకాశాలు

అన్ని సర్వేల్లోనూ గులాబీకే ఛాన్స్

హైదరాబాద్,జనవరి24(ఆర్ఎన్ఎ): తెలంగాణ మున్సిపల్ ఎన్నికల్లో అధికార టీఆర్ఎస్ విజయ దుందుభి మోగిస్తుందని పలు సర్వేలు అంచనా వేస్తున్నాయి. టీఆర్ఎస్ కూడా సొంత సర్వేలో ఇదే విషయాన్ని చెబుతోంది. మున్సిపోల్స్‌లో 90శాతం పైగా స్థానాలు గెల్చుకుంటామని పార్టీ రాష్ట్ర కార్యదర్శి పల్లా రాజేశ్వర్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. హైదరాబాద్ కేంద్రంగా పనిచేస్తున్న పీపుల్స్ పల్స్ సంస్థ నిర్వహించిన ప్రీ పోల్ సర్వే కూడా ఇదే అంశం స్పష్టం చేసింది. జనవరి 17 నుంచి 19 వరకు 20 శాతం మున్సిపాలిటీలు, మూడు కార్పొరేషన్ల పరిధిలో ప్రీ పోల్ సర్వేను చేపట్టినట్టు ఆ సంస్థ తెలిపింది. కార్పొరేషన్లు, మున్సిపాలిటీలలో భారీ సంఖ్యలో టీఆర్ఎస్ అభ్యర్థులు విజయం సాధిస్తారని పేర్కొంది.అలాగే కార్పొరేషన్లలో టీఆర్ఎస్‌కు 49.1 శాతం, కాంగ్రెస్‌కు 21 శాతం, బీజేపీకి 23.8 శాతం, ఎంఐఎంకు 3.3 శాతం ఓట్లు వస్తాయని ఆ సంస్థ అంచనా వేసింది. అలాగే 120 మున్సిపాలిటీల్లో టీఆర్ఎస్‌కు 52.3 శాతం, కాంగ్రెస్‌కు 23.3 శాతం, బీజేపీకి 16.1 శాతం, ఎంఐఎంకు 1.6 శాతం ఓట్లు వస్తాయని తెలిపింది. కార్పొరేషన్లలో, మున్సిపాలిటీల్లో టీఆర్ఎస్ స్పష్టమైన అధిక్యం కనబరుస్తుందని వెల్లడించింది. టీఆర్ఎస్‌తో పొల్చితే బీజేపీ, కాంగ్రెస్‌లు చాలా తక్కువ స్థానాల్లో విజయం సాధిస్తాయని పేర్కొంది.

దావోస్ పర్యటనలో బిజీబిజీగా మంత్రి కెటిఆర్

పెట్టుబడులే లక్ష్యంగా పారిశ్రామిక వేత్తలతో చర్చలు

వివిధ రంగాల ప్రముఖులతో భేటీలు

హైదరాబాద్,జనవరి24(ఆర్ఎన్ఎ): మంత్రి కేటీఆర్ దావోస్ పర్యటన దిగ్విజయంగా కొనసాగుతోంది. తెలంగాణకు మరిన్ని పెట్టుబడులు తీసుకురావడమే లక్ష్యంగా ఆయన కృషి చేస్తున్నారు. వరల్డ్ ఎకనామిక్ ఫోరం సదస్సులో బిజీబిజీగా ఉన్న కేటీఆర్ పలువురు పారిశ్రామిక నేతలతో సమావేశమై తెలంగాణలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను వివరిస్తున్నారు. పెట్టుబడులే లక్ష్యంగా ఆయన చర్చలు చేస్తున్నారు. తాజాగా ఏడబ్ల్యూఎస్ క్లౌడ్ వైస్ ప్రెసిడెంట్ తో పాటు సాఫ్ట్ బ్యాంక్ సీనియర్ మేనేజింగ్ పార్టనర్ దీప్ నిషార్‌తో కేటీఆర్ భేటీ అయ్యారు. అనంతరం నెస్లే ఏసియా సీఈవో క్రిస్ జాన్సన్ .. కేటీఆర్ తో సమావేశమయ్యారు. రాష్ట్రంలో ఫుడ్ ప్రాసెసింగ్ రంగంలో అవకాశాల గురించి అడిగి తెలుసుకున్నారు.

వ్యవసాయ, పాడి పరిశ్రమ రంగాల్లో తెలంగాణ సాధించిన ప్రగతిని కేటీఆర్ ఆయనకు వివరించారు. దావోస్ పర్యటనలో మంత్రి కేటీఆర్‌తో ఫార్మా కంపెనీల ప్రతినిధులు భేటీ అయ్యారు. తొలుత సానోఫిపాస్టర్ ఫార్మా కంపెనీ ఎగ్జిక్యూటీవ్ వైస్ ప్రెసిడెంట్ డేవిడ్.. తెలంగాణ పెవిలియన్ లో మంత్రి కేటీఆర్ ను కలిశారు. ఫార్మా రంగంలో పెట్టుబడులు పెట్టేందుకు హైదరాబాద్ అనువైందని మంత్రి కేటీఆర్ ఆయనకు వివరించారు. వ్యాక్సిన్ ఉత్పత్తికి సంబంధించిన పలు అంశాలపై ఇరువురి మధ్యచర్చ జరిగింది. అటు డెన్మార్క్ కు చెందిన నోవో నార్ డిస్క్ ఫార్మా కంపెనీ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ క్యామిలా మంత్రి కేటీఆర్ తో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను మంత్రి కేటీఆర్ వారికి వివరించారు. నోవో నార్ డిస్క్ కంపెనీ ప్రపంచవ్యాప్తంగా 40 వేల మందికి ఉపాధి కల్పిస్తోంది. దావోస్ లోని తెలంగాణ పెవిలియన్ లో సౌదీ కమ్యూనికేషన్ మినిస్టర్ అబ్దుల్లా మంత్రి కేటీఆర్ ను కలిశారు. ఈ సందర్భంగా ఇరువురి మధ్య పలు అంశాలపై చర్చ జరిగింది. హైదరాబాద్ లో పర్యటించాలని సౌదీ మినిస్టర్ ను మంత్రి కేటీఆర్ కోరారు. అటు కోకాకోలా సీఈవో జేమ్స్ క్విన్సీ, మహీంద్ర గ్రూప్ ఛైర్మన్ ఆనంద్ మహీంద్ర.. మంత్రి కేటీఆర్‌ను కలిశారు. కొరియా మంత్రి యంగ్‌సున్, యూ ట్యూబ్ సీఈవో సుసన్ తోనూ మంత్రి కేటీఆర్ భేటీ అయ్యారు. మరోవైపు అమెజాన్ వెబ్ సర్వీసెస్ వైస్ ప్రెసిడెంట్, ది రెవెనంట్‌పుస్తక రచయిత మైఖేల్ పంకే కేటీఆర్ ను కలిశారు. మైక్రాన్ టెక్నాలజీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ సంజయ్ మల్హోత్ర కూడా మంత్రి కేటీఆర్‌తో సమావేశమయ్యారు. ఇద్దరిమధ్య హైదరాబాద్‌లో పెట్టుబడులకు సంబంధించిన అంశాలపై చర్చ జరిగింది.

వారాసిగూడలో బాలిక దారుణహత్య

హైదరాబాద్,జనవరి24(ఆర్ఎన్ఎ): హైదరాబాద్ చిలకలగూడ పోలీస్ స్టేషన్ పరిధిలోని వారసిగూడాలో గురువారం రాత్రి దారుణం చోటుచేసుకుంది. ఇర్ఫానా అనే బాలికను దుండగులు దారుణంగా హత్యచేశారు. బాలిక ఉంటున్న ఇంటిపై రక్తపు మరకలు ఉన్నట్టు పోలీసులు గుర్తించారు. ఈ విషాద ఘటన స్థానికంగా కలకలం రేపుతోంది. స్థానికుల సమాచారంతో ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు. అనంతరం క్లూస్ టీం ఆధారాలు సేకరిస్తున్నట్టు సమాచారం. ఈ ఘటనకు సంబంధించి ఇద్దరు అనుమానితులను అదుపులోకి తీసుకోని విచారిస్తున్నామని పోలీసులు తెలిపారు. పూర్తి సమాచారం ఇంకా తెలియాల్సిఉంది.

జాన్‌పహాడ్ దర్గా గంధోత్సవంలో పాల్గొననున్న హోంమంత్రి మహమూద్ అలీ

సూర్యాపేట , జనవరి 24: జిల్లాలోని పాలకవీడు మండలంలోని జాన్‌పహాడ్ దర్గా ఉత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. మూడురోజుల ఉత్సవాల్లో భాగంగా మొదటిరోజైన గురువారం వేకువజామునే దర్గా పూజారి సయ్యద్ అలీబాబా, జానీల ఇంటి నుంచి మేళతాళాలతో గంధ కలశాలను, దట్టీలను ఊరేగింపుగా దర్గాకు తీసుకొచ్చారు. దర్గాలోని హజ్రత్ సయ్యద్, మొహినుద్దీనా షా సమాధులతోపాటు వెలుపల ఉన్న సైనిక బృందాల సమాధులపై గంధం చల్లి, పూలు, దట్టీలతో అలంకరించారు. సమాధుల చుట్టూ మహిళలు కొవ్వొత్తులు వెలిగించి ప్రార్థనలు చేశారు. భక్తులు కొబ్బరికాయలు కొట్టి మొక్కులు చెల్లించుకున్నారు. సమీపంలో గల నాగదేవతకు మహిళలు ప్రత్యేక పూజలు చేశారు. నేడు జరిగే గంధం ఊరేగింపునకు హోంమంత్రి మహమూద్ అలీ, హుజూర్‌నగర్, కోదాడ, మిర్యాలగూడ ఎమ్మెల్యేలు శానంపూడి సైదిరెడ్డి, బొల్లం మల్లయ్య యాదవ్, భాస్కర్‌రావు తదితరులు హాజరుకానున్నారు. హోంమంత్రి ఇప్పటికే దామరచర్ల మండల కేంద్రానికి చేరుకున్నారు. స్థానిక టీఆర్ఎస్ నాయకులు మహమూద్ అలీకి ఘన స్వాగతం పలికారు. రాష్ట్రంతో పాటు ఆంధ్రప్రదేశ్ నుంచి కూడా భక్తులు పెద్ద సంఖ్యలో చేరుకునే అవకాశం ఉన్నందున అందుకు తగ్గట్టుగా నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు.

భారత ఆర్చర్లకు శుభవార్త

నిషేధం ఎత్తివేస్తున్నట్లు ప్రపంచ సంస్థ ప్రకటన

కోల్‌కతా,జనవరి24(ఆర్ఎన్ఎ): టోక్యో ఒలింపిక్స్ కోసం సన్నద్ధమవుతున్న భారత ఆర్చర్లకు ప్రపంచ ఆర్చరీ(డబ్ల్యూఆర్) తీపి కబురు చెప్పింది. భారత ఆర్చరీ సంఘం(ఏఏఐ)పై విధించిన నిషేధాన్ని ఎత్తివేస్తున్నట్టు డబ్ల్యూఆర్ ప్రకటించింది. ఏఏఐ ఎన్నికలు గత వారం జరిగిన నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకుంది.

దీంతో ఈ ఏడాది జూలై 24 నుంచి జరిగే విశ్వక్రీడల్లో దేశం తరఫునే మన ఆర్చర్లు బాణాలను ఎక్కుపెట్టనున్నారు. కాగా, నిషేధం తొలగించిన డబ్ల్యూఆర్... ఏఏఐకు కొన్ని షరతులు విధించింది. అ÷-లథెట్ సభ్యత్వం కోసం నిబంధనల్లో మార్పులు చేయడంతో పాటు పాలనపరమైన సమస్యల పరిష్కారం, వ్యూహాత్మక ప్రణాళికను అభివృద్ధి చేసుకోవాలని సూచించింది. ఎన్నికల్లో నెలకొన్న వివాదాల కారణంగా వరల్డ్ ఆర్చరీ గతేడాది ఆగస్టు 5న ఏఏఐపై నిషేధం విధించింది. తాజాగా నిషేధం ఎత్తేయడంతో వచ్చే నెల లాస్‌వేగాస్‌లో జరిగే ఇండోర్ వరల్డ్ సిరీస్‌లో భారత ఆర్చర్లు దేశం తరఫున బరిలోకి దిగనున్నారు.

ప్రశాంతంగా మున్సిపల్ రీపోలింగ్

హైదరాబాద్,జనవరి24(ఆర్ఎన్ఎ): మహబూబ్‌నగర్, కామారెడ్డి, బోధన్‌లో రీపోలింగ్ కొనసాగుతుంది. టెండర్ ఓటు వల్ల మూడు చోట్ల ఒక్కో పోలింగ్ కేంద్రంలో అధికారులు రీపోలింగ్‌ను చేపట్టారు. బోధన్‌లోని 32వ వార్డు, 87వ పోలింగ్ కేంద్రంలో.. మహబూబ్‌నగర్‌లోని 41వ వార్డు 198వ కేంద్రంలో.. కామారెడ్డిలోని 41వ వార్డు 101వ పోలింగ్ కేంద్రంలో రీపోలింగ్‌ను చేపట్టారు. ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు రీపోలింగ్ నిర్వహిస్తున్నారు. ఓ వ్యక్తి తన ఓటును మరెవరైనా వేసినట్లు గుర్తిస్తే.. అలాంటి ఓటరుకు టెండర్ ఓటు వేసే అవకాశం ఉంటుంది. పోలింగ్ కేంద్రానికి వచ్చేసరికి తన ఓటు వేరే వాళ్లు వేసి ఉంటే.. దాన్ని సవాల్ చేస్తూ టెండర్ ఓటు వేయవచ్చు. ఆ ఓటరు సరైన ఆధారాలు చూపితే పోలింగ్ అధికారి ప్రత్యేక బ్యాలెట్ పేపర్ ఇస్తారు. దానిపై సదరు ఓటరు టెండర్ ఓటు వేసిన తర్వాత ప్రత్యేక కవరులో ఉంచి, పోలింగ్ అనంతరం ఎన్నికల అధికారులకు అందజేస్తారు. టెండర్ ఓటు వేసినచోట ఎన్నికల్లో అక్రమాలు జరిగాయని గుర్తించి ఈసీ రీపోలింగ్ నిర్వహిస్తుంది.

కరోనా వైరస్.. 26 మంది మృతి

హైదరాబాద్, జనవరి 24: చైనాలో కరోనా వైరస్ విజృంభిస్తున్న విషయం తెలిసిందే. ఆ వైరస్ వల్ల మృతిచెందిన వారి సంఖ్య 26కు చేరుకున్నది.

హుబయి ప్రావిన్సు మొత్తం ఆంక్షలు విధించారు. ఆ రాష్ట్రంలో ఉన్న సుమారు పది నగరాల్లో ట్రావెల్ బ్యాన్ విధించారు. దేశవ్యాప్తంగా 830 కరోనా కేసులను అధికారులు ధ్రువీకరించారు.

చైనా నూతన సంవత్సరం సమీపిస్తున్న తరుణంలో వైరస్ ప్రబలుతున్న తీరు ఆందోళన కలిగిస్తున్నది. దీంతో షాంఘైలోని డిస్నీ రిసార్ట్‌ను మూసివేశారు. అనేక ఉత్సవాలను రద్దు చేశారు. ప్రస్తుతం కరోనా వైరస్.. చైనాలోని అన్ని ప్రాంతాలకు వ్యాప్తి చెందింది. జపాన్, థాయిలాండ్, అమెరికా దేశాల్లోనూ కరోనా కేసులు నమోదు అయ్యాయి. మృతుల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో.. చైనాలో ట్రావెల్ ఆంక్షలు కూడా పెరుగుతున్నాయి.

చరిత్రలో నేటినిజం

కం॥ ప్రతి మలమగుగా ప్రమువూ
కవితా శ్రీ కృష్ణ మూర్తి ఖ్యాతి గడింపన్
కవితా సుప్రహ్మణ్యము
నవ గాయనిగా సభలము నతులందుకొనునే!!

(జనవరి 25 కవితా (కృష్ణమూర్తి) సుప్రహ్మణ్యం జననం)

-రాధశ్రీ

సెల్: 9494481210

పెరియార్ విగ్రహ ధ్వంసం.. ఖండించిన స్టాలిన్

చెన్నై,జనవరి24(ఆర్ఎన్ఎ): తమిళనాడు చెంగల్పట్ జిల్లాలోని కలియపట్టాయి గ్రామంలో ప్రతిష్టించిన ద్రవిడ ఉద్యమ నేత పెరియార్ విగ్రహాన్ని గుర్తు తెలియని వ్యక్తులు పాక్షికంగా ధ్వంసం చేశారు.

ధ్వంసమైన పెరియార్ విగ్రహాన్ని చూసి గ్రామస్తులు షాక్ అయ్యారు. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు పోలీసులు కలియపట్టాయి గ్రామానికి చేరుకున్నారు. పెరియార్ విగ్రహం కుడి చేయి, ముఖాన్ని ధ్వంసం చేసినట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. తమిళ సూపర్‌స్టార్ రజనీకాంత్ ఇటీవల పెరియార్‌పై చేసిన వ్యాఖ్యలు ఇప్పటికే కలకలం రేపుతున్నాయి. జనవరి 14న తుగ్లక్ పత్రిక వేడుకల్లో పాల్గొన్న రజనీకాంత్.. 1971లో సేలంలో పెరియార్ నిర్వహించిన ర్యాలీ లో సీతారాముల విగ్రహాలను నగ్నంగా, వాటి మెడలో చెప్పుల దండలేసి ఊరేగించారని పేర్కొన్నారు. పెరియార్‌పై చేసిన వ్యాఖ్యల పట్ల రజనీకాంత్ క్షమాపణ చెప్పాలని డీఎంకే నాయకుడు స్టాలిన్ డిమాండ్ చేశారు. ఈ విషయంలో తాను క్షమాపణలు చెప్పేది లేదని రజనీకాంత్ స్పష్టం చేశారు. తాను చదివిని, విన్న అంశాల ఆధారంగానే మాట్లాడనని రజనీ చెప్పారు. అంతేగానీ ఊహజనిత వ్యాఖ్యలు చేయ లేదన్నారు. ఎవరైనా తన నుంచి క్షమాపణలు ఆశిస్తే.. తాను క్షమించమని కోరలేను అని రజనీకాంత్ స్పష్టం చేశారు.

వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురు మృతి

సిద్దిపేట/హైదరాబాద్, జనవరి 24: ఈ రెండు జిల్లాల్లో జరిగిన వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురు మృతి చెందారు. ములుగు మండలం బండమైలారం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు ప్రాణాలు కోల్పోయారు. యువకులు ప్రయాణిస్తున్న బైక్‌ను వేగంగా వచ్చిన టిప్పర్ ఢీకొట్టడంతో ఈ ప్రమాదం జరిగింది. మృతులను కొక్కొండకు చెందిన కుమార్, స్వామిగా పోలీసులు గుర్తించారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. నగరంలోని మల్కాజ్‌గిరి ఆనంద్‌బాగ్‌లోనూ రోడ్డుప్రమాదం జరిగింది. వెంకట్ ప్లాజా అపార్ట్‌మెంట్‌లో కారు రివర్స్ తీస్తుండగా.. మూడు సంవత్సరాల బాలుడు కారు చక్రాల కింద పడిపోయాడు. దీంతో ఆ బాలుడు మృతి చెందాడు. బాలుడి మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. మల్కాజ్‌గిరి పోలీసులు విచారణ జరుపు తున్నారు.



కరీంనగర్ మున్సిపల్ ఎన్నికల్లో బారులు తీరిన మహిళా ఓటర్లు

మనిషికి పరాయితనం పెరగడానికి కారణం అదే.!

నేటినిజం
శనివారం 25-1-2020

దేశానికి సేవ చేయడం అంటే పడిపోయిన ఇళ్లను తిరిగి నిలబెట్టడం కాదు. ప్రజల హృదయాలను అర్థం చేసుకుని వారిలో జీవనకాంక్షను రగిలించడమే. ఆలోచనల్లో అస్పష్టత ఉంటే సమాజం తారుమారు అవుతుంది. ప్రతి మానసిక బాధ వెనుక ఓ సామాజిక కారణం ఉంటుంది. వాటిని గుర్తించి పరిష్కారాలు చూపడమే ప్రభుత్వాల బాధ్యత. యువత గురించి మాట్లాడితే మాదక ద్రవ్యాలు, హింస, నేరం, లైంగిక విశృంఖలత లాంటివే తొలి ప్రస్తావనలవుతాయి. వాటి మూలాలను స్పృశిస్తే తప్ప పునాది సమస్యలు అవగతం కావు. అస్తిత్వ సంక్షోభం పాతాళానికి చేరుతున్న ఆత్మవిశ్వాసం ఏమీ చేయలేనేమో అన్న నిరాశావాదం. ఏది తప్పో, ఏది ఒప్పో తేల్చుకోలేని సందిగ్ధత, అసమాన అవకాశాల మధ్య ఉక్కిరిబిక్కిరి చేస్తున్న పరుగు పోటీ– యువతను దారి తప్పిస్తున్న మౌలిక సమస్యలు సమాజంలో భాగంగా ఉంటూనే ప్రతి వ్యక్తీ తన ప్రత్యేకతను నిలుపుకునే ప్రయత్నం చేస్తాడు. ఆ ప్రత్యేకతను నిలబెట్టుకునే అవకాశాలు మృగ్యమైనపుడు ఆ వ్యక్తికి సమాజంతో సమరం మొదలవుతుంది. సమాజంతో మనిషికి పరాయితనం పెరగడానికి కారణం అదే! యువతోని అస్తిత్వ సంక్షోభానికి మూలమిదే! ఎలాంటి ప్రపంచం కావాలనే దానికన్నా ఎలాంటి ప్రపంచాన్ని వద్దనుకుంటున్నామో నిర్ణయించుకోవడం మంచిది. నిత్యం ఊహాలోకంలో విహరిస్తూ దేనినైనా మ్యాజిక్ చేసేయాలన్న పలాయనవాదాన్ని ప్రబోధిస్తాయి. ఒకరు ఒక పనిని చేయలేక పోతున్నానని, తన వ్యవహారాలను సరైన సమయంలో చక్కపెట్టుకోలే కపోతున్నానని, అసవసరంగా ఈ డబ్బు ఖర్చుచేసానని, నా మరణానికి కారణం ఎవరూ బాధ్యులు కారు కానీ ఆత్మహత్య చేసుకునే యువతరపు లోకమిది. యువతలో తలెత్తే అస్థిరత, భయం, గందరగోళం ఆత్మన్యూనత, వంటి భావోద్వేగాలకు చాలా వరకు పెద్దలదే బాధ్యత. తమ లక్ష్యాలను పిల్లల లక్ష్యాలుగా బలవంతంగా మార్చి చిన్నారుల జీవితాలను చిదిమేస్తున్న సమాజంలో మనం జీవించేస్తున్నాం. అసలు ఏం చదివారో, ఏమి చదువుతున్నారో కూడా తెలియకుండా ఒక్కో మెట్టూ ఎక్కి డిగ్రీ పిజీ పట్టాలు పుచ్చుకుంటున్న ఈ రోజుల్లో యువత చివరికి ఎందుకూ పనికిరాకుండా మిగిలిపోతోంది. వెల్లిన ప్రతిచోటా తమ పిల్లలకే మొదటి స్థానం దక్కాలన్న తల్లితండ్రుల అత్యాశ, వారిపై వత్తిడి పెంచుతోంది. తమ ఆశయాలను, లక్ష్యాలను నెరవేర్చే మరబొమ్మలుగానే పిల్లల్ని చూసే తల్లితండ్రులు సంక్షోభానికి అంటకడుతున్నారు. పిల్లల ప్రవర్తన లోపాలకు పెద్దలే ఎక్కువ బాధ్యత వహించాల్సి ఉంటుంది. గతంలో ముంబయిలోని ఓ పాఠశాల యాజమాన్యం స్కూలు ఆవరణలో బాలబాలికలెవరూ ఒకరినొకరు తాకరాదనే విధానాన్ని ప్రవేశపెట్టింది. నైతిక వర్తనను నేర్పించాల్సిన పాఠశాలలు నియంత్రణ పేరిట మొరటు పద్ధతులు అనుసరిస్తే పిల్లల మనసులు కలుషితమయ్యే ప్రమాదం ఉంది. ఇలా సమాజం రూపొందించిన అనేకానేక విధానాలను కాదనలేక, తాము కోరుకున్న విధానాలకు తమను ఆవిష్కరించుకోలేక సంఘర్షణలో ఉంటున్న యువతకు ఆత్మవిశ్వాసం అవసరమేమో,,!

ఓట్ల లెక్కింపునకు పక్కాగా ఏర్పాట్లు

పాలిటెక్నిక్ కాలేజీలో నిజామాబాద్ కౌంటింగ్

ఫలితాలపై అభ్యర్థుల్లో టెన్షన్

నిజామాబాద్,జనవరి24(ఆర్ఎన్ఎ): నిజామాబాద్ పాలిటెక్నిక్ కళాశాలలో మున్సిపల్ కార్పొరేషన్ ఓట్ల లెక్కింపు పక్రియను శనివారం ఉదయం చేపడతారు. ఆర్మూర్ మున్సిపాలిటీ కౌంటింగ్ పక్రియ పిప్రి గ్రామ ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో, బోధన్‌లో అక్కడి ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో ఓట్ల లెక్కింపు, భీమ్‌గల్ ఓట్ల లెక్కింపు పక్రియ అక్కడి ప్రభుత్వ జూనియర్ కాలేజీలో చేపడతారు. 25న శనివారం ఉదయం 7గంటల నుంచి లెక్కింపు పక్రియ మొదలుకానుంది. తొలుత భీమ్‌గల్ మున్సిపాలిటీ ఫలితాలు వెల్లడి కానున్నాయి. కౌంటింగ్ పక్రియ కోసం అధికార యంత్రాంగం ఏర్పాట్లు పూర్తి చేసింది. నిజామాబాద్ కార్పొరేషన్ పరిధిలో మొత్తం 60 డివిజన్లు ఉండడం తో లెక్కింపు ఆలస్యం కానుంది. బ్యాలెట్ పద్ధతి అయినందున తుది ఫలితాల వెల్లడికి చాలా సమయం తీసుకునే అవకాశం ఉంది. నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఓట్ల లెక్కింపు కోసం ఎంపిక చేసిన పాలిటెక్నిక్ కళాశాలలో ఏర్పాట్లను కలెక్టర్ నారాయణరెడ్డి ఇప్పటికే పరిశీలించారు. నగరంలో 60 డివిజన్లు ఉండగా.. రెండు కౌంటింగ్ హాళ్లను ఒక భవనంలోనూ, వెనుక భాగంలో మరో 30 డివిజన్లకు మూడు కౌంటింగ్ హాల్‌లను వెనుక భాగంలో లెక్కించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. కౌంటింగ్ ఏజెంట్లు వెళ్లడానికి, అదే విధంగా కౌంటింగ్ సిబ్బంది వెళ్లడానికి వేర్వేరుగా బారికేడ్లు ఏర్పాటు చేసారు. ఏ డివిజన్ పరిధిలోకి వెళ్లాలో వారికి అర్థమయ్యే విధంగా సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు.గెలుపు ఎవరిని వరిస్తుందోనని అందరిలోనూ ఉత్కంఠ నెలకొంది.

25న జరిగే ఆ తర్వాత ఆర్మూర్, బోధన్ ఫలితాలు సాయంత్రం వరకు వస్తాయి. గెలుపు ఎవరిని వరిస్తుందో తెలియని ఉత్కంఠ కొనసాగుతోంది. ఈనెల 27న మేయర్, చైర్మన్ల ఎన్నిక నిర్వహించుకోవచ్చని ఎన్నిక షెడ్యూల్‌ను రాష్ట్ర ఎన్నికల సంఘం గురువారం విడుదల చేసింది. కౌంటింగ్ పక్రియ పూర్తయి.. అదే రోజు ఫలితాలు వెల్లడిస్తారు. ఆ తర్వాత కొత్తగా ఎన్నికైన కార్పొరేటర్లకు, కౌన్సిలర్లకు ప్రమాణ స్వీకారం చేయించాల్సి ఉంటుంది. ఈనెల 27న ఉదయం 11 గంటలకు ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి కలెక్టర్ అధ్యక్షతన ప్రమాణ స్వీకార కార్యక్రమం నిర్వహిస్తారు. అదే రోజు మధ్యాహ్నం 12.30 గంటలకు మేయర్, డిప్యూటీ మేయర్, చైర్మన్, వైస్ చైర్మన్ల ఎన్నిక నిర్వహిస్తారు. చేతులెత్తే పక్రియ ద్వారా మేయర్, డిప్యూటీ మేయర్, చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక ఉంటుంది. ఓటరు తీర్పు ఎలా ఉంటుందో తెలియక ఉత్కంఠకు లోనవుతున్నారు.

ఎన్నికల కౌంటింగ్‌కు ఏర్పాట్లు పూర్తి

ఫలితాలతో ఉత్కంఠకు తెర

ఖమ్మం,జనవరి24(ఆర్ఎన్ఎ): మున్సిపల్ ఎన్నికల కౌంటింగ్‌కు అధికారులు ఏర్పాట్లను పూర్తి చేశారు. ఉదయం 8గంటలకు కౌంటింగ్ మొదలు కానుంది. భారీ బందోబస్తు మధ్య కౌంటింగ్ జరుగనుంది. కౌంటింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్‌ను విధించనున్నారు. రెండంచల భద్రతను ఏర్పాటుచేస్తున్నారు. ఈ నెల 27న చైర్మన్ల ఎన్నిక పక్రియ జరగనుంది. అదే రోజున నూతన పాలకమండళ్ల తొలి సమావేశం నిర్వహిస్తారు. తొలి సమావేశంలోనే చైర్మన్ల ఎన్నిక పక్రియను చేపట్టనున్నారు. సభ్యుల ప్రమాణ స్వీకారం అనంతరం మధ్యాహ్నం 12 గంటల 30 నిమిషాలకు ఎన్నికల పక్రియను పూర్తి చేయనున్నారు.

ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని వైరా, సత్తుపల్లి, మధిర, కొత్తగూడెం, ఇల్లెందు పట్టణాల్లో బుధవారం ఎన్నికలు హోరాహోరీగా ముగిశాయి.. ఎన్నికల ఫలితాలు ఏ విధంగా వస్తాయోనని అన్ని పక్షాల్లోనూ ఆసక్తిగా ఉంది. పడ్డాయి.. శనివారం ఈ ఉత్కంఠకు తెరపడనుంది.. ఐదు మునిసిపాలిటీల పరిధిలో పకడ్బందీగా ఓట్ల లెక్కింపు పక్రియ జరుగనుంది.. ఎన్నికల ఫలితాలు విడుదల కానున్నాయి.. ఈ నెల 27న జరిగే తొలి సమావేశంలోనే, చైర్మన్ల ఎన్నిక పక్రియ జరుగనుంది. సభ్యుల ప్రమాణ స్వీకారం అనంతరం మధ్యాహ్నం 12 గంటల 30 నిమిషాలకు ఎన్నికల పక్రియ పూర్తి కానుంది.

నేడురేపు సిద్దిపేటలో హాట్ ఎయిర్ బెలూన్ ఫెస్టివల్

–మంత్రి హరీష్ రావు చొరవతో ఏర్పాటు

సిద్దిపేట,జనవరి24(ఆర్ఎన్ఎ): గణతంత్ర దినోత్సవం సందర్భంగా సిదద్ఇపేట పట్టణంలో 25, 26 తేదీల్లో రెండు రోజుల పాటు హాట్ ఎయిర్ బెలూన్ ఫెస్టివల్ కార్యక్రమం నిర్వహించనున్నారు.ఆర్థిక శాఖ మంత్రి హరీశ్‌రావు చొరవతో టూరిజం శాఖ ఒక వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. పట్టణ ప్రజల ఆహ్లాదానికి మారుపేరుగా నిలవనుంది. అభివృద్ధికి మారుపేరుగా ఎదిగిన పట్టణం సిద్దిపేట, అలాంటి అభివృద్ధిని, కోమటి చెరువు అందాలను హాయిగా గాల్లో ఎగురుతూ వీక్షించడానికి సిద్దిపేటకి ఎయిర్ బెలూన్లు రానున్నాయి. వర్టికల్ వరల్డ్ సంస్థ వారు మంత్రి హరీశ్‌రావు, టూరిజం శాఖ అభ్యర్థన మేరకు శనివారం సాయంత్రం కోమటి చెరువుపైన, 26న ఉదయం ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో, 26న సాయంత్రం కోమటిచెరువుపై ఈ హాట్ బెలూన్ ఫెస్టివల్ నిర్వహించనున్నారు. ఈ హాట్ బెలూన్ ఫెస్టివల్ ఊటీ, అరుకు, మహానగరాల తరహాలో సిద్దిపేట పట్టణంలో నిర్వహించడం గర్వకారణం. రెండు రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమానికి సిద్దిపేట ప్రజలు, యువత పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని టూరిజం శాఖ అధికారులు కోరారు. వర్టికల్ వరల్డ్ సంస్థ ద్వారా నిర్వహించే ఈ బెలూన్ ఫెస్టివల్‌లో ఆసక్తి కలిగిన యువతకి అడ్వెంచర్ గేమ్స్‌పై శిక్షణ కల్పించి ఉపాధి కల్పిస్తారు. ఈ ప్రదర్శన ప్రజలకు నచ్చి, ఆదరణ పొందితే సిద్దిపేటలోనే హాట్ బెలూన్‌ను ఏర్పాటు చేస్తారు. అంతేకాకుండా రూరల్ గ్రామాల్లోని యువతకి అడ్వెంచర్ గేమ్స్ నేర్చుకోవాలనే ఆసక్తి ఉంటే వారికి శిక్షణ ఇప్పిస్తారు.

బిడిఎల్‌లో 15శాతం ప్రభుత్వ వాటా విక్రయం

కేంద్ర ప్రభుత్వం నిర్ణయం

న్యూఢిల్లీ,జనవరి24(ఆర్ఎన్ఎ): భారత ప్రభుత్వ రంగ సంస్థ భారత్ డైనమిక్స్ లిమిటెడ్ లో 15 శాతం ప్రభుత్వ వాటాను విక్రయించనున్నట్టు పెట్టుబడులు, ప్రభుత్వ ఆస్తుల నిర్వహణ శాఖ ప్రకటించింది. రక్షణ మంత్రిత్వ శాఖ పరిధిలోని ప్రభుత్వ రంగ సంస్థ అయిన బీడీఎల్, అత్యాధునిక గైడెడ్ ఆయుధ వ్యవస్థలను తయారుచేయగల అతికొద్ది భారతీయ సంస్థలలో ఒకటి. హైదరాబాద్ కేంద్రంగా పనిచేసే భారత్ డైనమిక్స్ లో కేంద్ర ప్రభుత్వానికి 87.75 శాతం వాటా ఉంది. దీని కొనుగోలుకు ఆఫర్ ఫర్ సేల్ విధానం ద్వారా బిడ్లు వేయాల్సిందిగా ప్రభుత్వం వాణిజ్య బ్యాంకర్లను కోరింది. ఇదే కాకుండా నేషనల్ అల్యుమినియం కంపెనీ లిమిటెడ్, కోల్ ఇండియా లిమిటెడ్, ఎన్ఎండీసీ, ఎన్‌బీసీసీ లిమిటెడ్, భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్, నేషనల్ ఫర్టిలైజర్స్ లిమిటెడ్, హిందుస్తాన్ కాపర్ లిమిటెడ్ లాంటి సంస్థలలో కూడా పెట్టుబడుల ఉపసంహరణకు ప్రభుత్వం యోచిస్తోంది.

ఎంట్రెన్స్ షెడ్యూల్లో మార్పులు

హైదరాబాద్,జనవరి24(ఆర్ఎన్ఎ): పలు ఎంట్రెన్స్ టెస్టులకు సంబంధించి షెడ్యూల్‌లో మార్పులు చేశారు. ఎంసెట్, లాసెట్, పీజీ ఈసెట్ ఎంట్రెన్స్ పరీక్షల షడ్యూల్‌లో మార్పులు చేసినట్లు తెలంగాణ ఉన్నత విద్యామండలి చైర్మన్ పాపిరెడ్డి తెలిపారు. ఎంసెట్, లాసెట్, పీజీ ఈసెట్ ఎంట్రెన్స్ పరీక్షల షెడ్యూల్‌మే 4, 7, 8వ తేదీల్లో ఇంజినీరింగ్ ఎంసెట్, మే 9, 11వ తేదీల్లో ఫార్మా ఎంసెట్ మే 27వ తేదీన లాసెట్, పీజీఎల్‌సెట్, మే 28వ తేదీ నుంచి మే 31వ తేదీ వరకు పీజీ ఈసెట్ జరుగుతుందని అన్నారు.

ఓటరు దినోత్సవ ప్రతినకు ఇసి సిద్ధం కావాలి

హైదరాబాద్, జనవరి 24:ఏటా ఓటరు దినోత్సవం జరుపుకుంటున్నాం. జనవరి 25న ఓటరు దినోత్సవాన అట్టహాసాలు చేస్తున్నాం. సభలూ సమావేశాలు, ర్యాలీలు తీస్తున్నారు. అయినా పక్కాగా కార్యక్రమాలు జరగడం లేదు. ఎన్నికల సంఘం ఈ మేరకు అనేక కార్యక్రమాలతో ప్రజల్లో ఓటు చైతన్యానికి కృషి చేస్తోంది. అయితే సంస్థాగతంగా ఉన్న లోటుపాట్లపై మాత్రం దృష్టి సారించడం లేదు. ఓటర్ల నమోదు మొదలుకుని దొంగ ఓట్ల వరకు అనేక అనర్థాలు జరుగుతున్నా పట్టించుకోవడం లేదు. ఓటు వేసేందుకు వెళ్లే వరకు ఓటు ఉందో లేదో తెలియడం లేదు. ఆధార్ నమోదు చేసుకుంటే అలాగే ఉంటుంది. పాన్ కార్డు నమోదయితే ఉంటుంది. ఓటు నమోదయితే ఉండడం లేదు. అలాగే ఓటుకు కూడా ఆధార్ లాగా పర్మినెంట్ నంబర్ ఉంటే ఇలాంటి తొలగింపు అవకాశాలు ఉండవు. ఎలాంటి లోటుపాట్లు లేని ఓటరు నమోదుకు చర్యలు తీసుకోవాల్సిన అవసరాన్ని ఎన్నికల సంఘం గుర్తించడం లేదు. స్వతంత్ర ప్రతిపత్తి కలిగిన రాజ్యాంగ వ్యవస్థగా ఉన్న ఎన్నికల సంఘం ఈ మధ్య అనేక వివాదాల్లో చిక్కుకుంటోంది. విపరీతమైన అధికారాలు కలిగి ఉన్నా సమర్థత ప్రదర్శించడం లేదన్న విమర్శలు ఉన్నాయి. ప్రజాస్వామ్య వ్యవస్థకు ఎన్నికలు ప్రాణప్రదమైనవి. ఓటర్ల జాబితాలు ఎంత స్వచ్ఛంగా, దోషరహితంగా ఉంటే ఎన్నికలు అంత సవ్యంగా జరుగుతాయి. కానీ ఇప్పుడదే వివాదంగా మారింది. ఓటర్ల నమోదు, తొలగింపు ఓ ప్రహసనంగా మారింది. పక్కా కార్యాచరణ జరగడం లేదు. శేషన్ లాగా బూజు దులిపి హంటర్ చేతబట్టిన వారు తరవాతి కాలంలో రాలేదు. ఓటర్ల నమోదు, తొలగింపు, నిర్వహణ అంతా వివాదాల్లో నడుస్తోంది. ఎన్నికలను స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా నిర్వహించడం ఈ సంస్థ నైతిక బాధ్యత. ఓటర్ల జాబితాలలో అనేక అవకతవకలు బయటపడుతున్నా పట్టించుకోవడం లేదు.

ఎన్నికల కమిషన్ రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారిపైనా, రాష్ట్రప్రభుత్వ సిబ్బంది పైనా ఆధారపడి చర్యలు తీసుకోవలసి ఉంటుంది. రాష్ట్ర అధికారులు సహజంగానే అధికారపార్టీకి విధేయంగా ఉంటారు. అటువంటప్పుడు అధికారపార్టీ బుద్ధిపూర్వకంగా రకరకాల ఎన్నికల అక్రమాలకు ఒడిగట్టితే వాటిని ఎన్నికల కమిషన్ ఏవిధంగా నివారించగలదనే సందేహం కలుగుతోంది. ఓటర్ల తొలగింపు ఇప్పుడు పెద్ద సమస్యగా పరిణమించింది. దీనిని ఏ విధంగా చక్కదిద్దుతారో తెలియడం లేదు. ఓటరు ఐడి కార్డు పట్టుకుని వెళితే జాబితాలో పేర్లు ఉండడం లేదు. దీనికి పక్కా విధానం అమలు కావాల్సి ఉంది. దొంగ ఓట్ల విషయంలో కూడా ఇసి సరైన చర్యలు తీసుకోవడం లేదు. అధికారుల పరిశీలనలో దొంగ ఓట్లు నమోదైనట్టు రుజువైతే తప్ప చర్యలకు ఉపక్రమించడం లేదు. ఎన్నికలు ఎప్పుడు రిగినా నామినేషన్ వేయడానికి గడువు ముగిసే క్షణం వరకూ కొత్త ఓట్లను చేర్చుకునే పక్రియ కొనసాగుతోంది. ఇకపోతే రాజకీయ పార్టీల ప్రమేయంతో ఓట్ల తొలగింపు జరుగుతోందన్న వాదన ఉంది. దీనిని అరికట్టేందుకు చర్యలు తీసుకోవాల్సి ఉంది. దొంగ ఓట్లను తొలగించాలనే పట్టుదల కేంద్ర ఎన్నికల కమిషన్‌కు నిజంగా ఉంటే అందుకోసం ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలి. అంకిత భావంతో పనిచేసే సిబ్బందిని తగినంతగా సమకూర్చాలని రాష్ట్రపతిని అభ్యర్థించాలి. నామినేషన్ల గడువు ముగియడానికి ముందు ఉన్న ఓట్లకు పదిహేను లేదా ఇరవై శాతం కొత్త ఓట్లు నమోదు చేస్తున్నారు. నామినేషన్లు ముగిసిన తర్వాత దొంగ ఓట్లను గుర్తించి, తొలగించడానికి తగిన సమయం ఉండటం లేదు. అక్రమాలు జరిగినట్టు తెలుసుకొని ఎన్నికల పక్రియ ముగిసిన తర్వాత అధికారులపైన ఎటువంటి చర్య తీసుకున్నా లాభం ఉండదు. చీఫ్ ఎలక్షన్ కమిషనర్లకు మంచి పేరు ఉన్నప్పటికీ ఎన్నికలలో ధన ప్రభావం విపరీతంగా పెరిగింది. అక్రమాలకు అంతులేకుండా పోతున్నది. అధికార యంత్రాంగాన్ని దుర్వినియోగం చేయడం యథావిధిగా జరుగుతోంది.

ఓట్ల నమోదులో కొన్ని రాజకీయ పక్షాలు అదే పని మీద ఉంటాయి. అధికార పార్టీ నేతలు బోగస్ ఓట్లను చేర్పించేందుకు ప్రత్యేక కార్యక్రమాన్ని ముమ్మరంగా కొనసాగిస్తున్నారన్న ఆరోపణలు అన్నచోట్లా వున్నాయి. సర్వేల పేరిట జరుగుతున్న తతంగం కూడా అధికార పార్టీ నేతల పర్యవేక్షణలోనే సాగుతోందని ప్రతిపక్షాలు అంటున్నాయి. రెవెన్యూ అధికారులు ఎటువంటి విచారణ లేకుండానే బోగస్ ఓటర్లను నమోదు చేసుకుంటున్నారంటూ ఆరోపణలు వస్తున్నాయి. దొంగ ఓట్లు ఫలానా ప్రాంతంలో ఉన్నాయనీ, దర్యాప్తు జరిపించి నిజం నిగ్గు తేల్చాలనీ ఎన్నికల ప్రధానాధికారి జిల్లా ఎన్నికల అధికారిని ఆదేశిస్తే చక్కదిద్దు తారన్న భరోసా లేదు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా గట్టి చర్యలు తీసుకోవాలి. అప్పుడే ఇసి సక్రమంగా ముందుకు వెళ్లగలదు. గతానుభవాను దృష్టిలో పెట్టుకుని పక్కాగా ఓటరు నమోదు కార్యక్రమం ఉండాలి. అవసరమైతే సాంకేతికతను మరింతగా ఉపయోగించుకోవాలి. ఎన్నికలలో అవకతవకలకు పాల్పడిన అధికారులు ఎంతవారైనా వారిపైన చర్యలు తప్పవన్న హెచ్చరికలు కఠినంగా అమలు కావాలి. అప్పుడే భయం ఏర్పడుతుంది. అందుకు ఎన్నికల సంఘం ముందుకు వస్తుందా అన్నది చూడాలి. ఓటరు దినోత్సవం జరుపుకుంటున్న వేళ కఠిన సంస్కరణలతో ఎన్నికల సంఘం ముందుకు సాగాల్సి ఉంది. ఓటరు నమోదు, తొలగింపు ప్రమసనంగా కాకుండా పక్కాగా జరగాలి. ఈ మేరకు మేధావులు, నిపుణుల సూచనలతో ఆధునిక సాంకతికతతో ముందుకు సాగాలని కోరుకుందాం.

ఎన్నికల కౌంటింగ్‌కు ఏర్పాట్లు పూర్తి

మధ్యాహ్నానికల్ల ఫలితాలు వెల్లడి

ఆదిలాబాద్,జనవరి24(ఆర్ఎన్ఎ): మున్సిపల్ ఎన్నికలు ముగిసి కౌంటింగ్‌కు జిల్లా అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేసింది. కౌంటింగ్ విధుల్లో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ దివ్యదేవరాజన్ ఆదేశించారు. ఈ మేరకు కౌంటింగ్ సిబ్బందికి తగిన సూచనలు చేశారు. 25న శనివారం కౌంటింగ్ సిబ్బంది ఉదయం 6 గంటలకే కేంద్రానికి చేరుకోవాలన్నారు. ఓట్ల లెక్కింపునకు అన్ని ఏర్పాట్లను ఇప్పటికే పూర్తి చేశారు. ఉదయం 8గంటలకు కౌంటింగ్ మొదలు పెట్టి మధ్యాహ్నానికల్ల ఫలితాలు ప్రకటిస్తారు. ఇకపోతే సిబ్బంది గుర్తింపు కార్డులను ధరించి కేటాయించిన ప్రాంతాల్లో విధులు నిర్వహించాలన్నారు. కౌంటింగ్ సమయంలో ఫోన్లకు అనుమతి ఉండదన్నారు. ముందుగా పోస్టల్ బ్యాలెట్ ఓట్లను లెక్కించనున్నారు. అనంతరం బాక్స్‌ల్లోని బ్యాలెట్ పత్రాలను కౌంటింగ్ ఏజెంట్ల సమక్షంలో సీల్ విప్పి కౌంటింగ్ నిర్వహించనున్నారు. ఓట్ల లెక్కింపును 32 మంది పరిశీలకులు, 32 మంది సూపర్‌వైజర్లు, 64మంది సహాయకులు, ముగ్గురు హాల్ సూపర్‌వైజర్లు, 16 మంది లేబర్లను నియమించారు. ఎప్పటికప్పుడు సమాచారాన్ని బోర్డుపై రాయడం, కంప్యూటరీకరణ చేయాలని అధికారులను ఆదేశించారు. పేపర్ సీల్ పరిశీలన, బ్యాలెట్ పేపర్ అకౌంట్లను సరిచూసుకోవాలని తెలిపారు.ఇకపోతే ఆదిలాబాద్ మున్సిపాలిటీకి బుధవారం జరిగిన ఎన్నికల్లో 70.05 శాతం పోలింగ్ నమోదు కాగా పురుషుల కన్నా మహిళలు ఎక్కువ సంఖ్యలో ఓటు హక్కును వినియోగించుకున్నారు. మొత్తం 1,27,922 మంది ఓటర్లు ఉండగా 89,612 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. వీరిలో పురుషులు 44,434 మంది, మహిళలు 45,178 మంది ఉన్నారు. పట్టణానికి సమీపంలో ఉండి గతంలో గ్రామపంచాయతీల పరిధిలో ఉన్న ఏరియాలో వార్డులు పునర్విభజనలో భాగంగా మున్సిపాలిటీలో కలువగా అక్కడ ఎక్కువ శాతం పోలింగ్ నమోదైంది.

మున్సిపాలిటీ ఎన్నికల్లో 49 వార్డుల్లో 70.05 శాతం పోలింగ్ నమోదైంది. పురుషుల కన్నా మహిళలు ఎక్కువ సంఖ్యలో ఓటు వేసేందుకు ఆసక్తి కనబర్చారు. పోలింగ్ సందర్భంగా పలు వార్డుల్లో మహిళా ఓటర్లు బారులు తీరి కనిపించారు. దీంతో ఎక్కువ శాతం వార్డుల్లో మహిళల ఓట్లు కీలకం కానున్నాయి. అభ్యర్థుల గెలుపు, ఓటములను సైతం మహిళలు నిర్ణయించనున్నారు. ఆయా వార్డుల్లో గెలుపుపై ధీమా వ్యక్తం చేస్తున్న అభ్యర్థులు మహిళల ఓట్లు తమకు అనుకూలంగా పడ్డాయని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. గతంలో మున్సిపల్ పరిధిలో 36 వార్డులు ఉండగా పునర్విభజనలో భాగంగా వార్డుల సంఖ్య 49కి పెరిగింది. పట్టణానికి సమీపంలో ఉన్న ఆదిలాబాద్ రూరల్, మావల మండలాల పరిధిలోని పలు గ్రామాలు మున్సిపల్ పరిధిలో చేరాయి.

గెలుపు ధీమాలో అధికార పార్టీ నేతలు

ఫలితాలు తమకే అనుకూలమని ప్రచారం

మల్లు భట్టి విక్రమార్కకు సవాల్ కానున్న మధిర

ఖమ్మం,జనవరి24(ఆర్ఎన్ఎ):ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని ఇ÷–లలెందు, కొత్తగూడెం, మధిర, సత్తుపల్లి, వైరా మున్సిపాలిటీలపై గులాబీ జెండా ఎగరడం ఖాయం అని టిఆర్ఎస్ నేతలు ధీమాగా ఉన్నారు. అయినా శనివారం నాటి ఫలితాల కోసం ఉత్కంఠగా ఎదురు చూస్తున్నారు. సత్తుపల్లిలో అన్ని స్థానాలనూ టీఆర్ఎస్ కైవసం చేసుకోబోతున్నదని స్థానిక ఎమ్మెల్యే సంగ్ర వెంకటవీరయ్య ధీమాగా ఉన్నారు. ఇక్కడ ఇప్పటికే ఆరు వార్డులను తన ఖాతాలో వేసుకున్న టీఆర్ఎస్ మిగిలిన 17 వార్డుల్లో కూడా గెలుపొందుతుందని ఆ పార్టీ నాయకులు పేర్కొంటున్నారు. సత్తుపల్లి మున్సిపల్ చైర్మన్. వైస్ చైర్మన్ స్థానాలను కూడా ఆ పార్టీకి దక్కనున్నాయి. వైరా మున్సిపాలిటీలోని 20 వార్డుల్లో 15 వార్డులకు తగ్గకుండా టీఆర్ఎస్ పార్టీ గెలుచుకునే అవకాశాలు ఉన్నాయని ఎమ్మెల్యే అన్నారు. ఈ రెండు చోట్ల స్థానిక శాసనసభ్యులు సంద్ర వెంకటవీరయ్య, లావుడ్యా రాములనాయక్‌లు ప్రతిష్టాత్మకంగా తీసుకొని పనిచేశారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రధాన బాధ్యతలను శాసనసభ్యులకే అప్పగించడంతో అన్నీ తామై ఎన్నికల్లో పనిచేశారు, అభ్యర్థుల ఎంపికలో కూడా వీరే కీలకంగా వ్యవహరించారు. అదేవిధంగా మధిర మున్సిపాలిటీలోని 22 వార్డుల్లో కూడా 15 వార్డులకు తగ్గకుండా టీఆర్ఎస్ గెలిచే అవకాశాలు ఉన్నాయి. ఈ మున్సిపాలిటీలో కూటమి అభ్యర్థులు కూడా బలంగానే ప్రచారం చేశారు. అయినప్పటికీ అధికారంలో ఉన్న పార్టీకి చెందిన అభ్యర్థులను గెలిపించినట్లయితే అభివృద్ధికి అవకాశం ఉంటుందని భావించిన ఓటర్లు కారు గుర్తు వైపే మొగ్గు చూపారనే అభిప్రాయం వ్యక్తమవుతున్నది. ముఖ్యంగా మధిర నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న కాంగ్రెస్ శాసనసభ్యుడు మల్లు భట్టి విక్రమార్కకు ఫలితాలు సవాల్ కానున్నాయి. ఈ మున్సిపాలిటీలో జిల్లా పరిషత్ చైర్మన్ లింగాల కమల్‌రాజ్ అన్నీ తానై బాధ్యతలు నిర్వర్తించారు. ఇల్లందు మున్సిపాలిటీలో రెబల్స్ బెడద ఉన్నప్పటికీ అధికార టీఆర్ఎస్ అభ్యర్థులు గెలుపు బాటలో పయనించబోతున్నారని అన్నారు. టీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి, ఇల్లెందు ఇన్‌చార్జ్ తాతా మధు, స్థానిక ఎమ్మెల్యే హరిప్రియలు ప్రధాన బాధ్యతలను తీసుకొని పనిచేశారు. మెజారిటీ స్థానాలను టీఆర్ఎస్ గెలుచుకొని చైర్మన్, వైస్ చైర్మన్ పదవులను కూడా సొంతం చేసుకునే అవకాశాలు ఉన్నాయని వారు అభిప్రాయపడుతున్నారు. కొత్తగూడెం మున్సిపాలిటీలోని అన్ని స్థానాల్లోనూ టీఆర్ఎన్ అభ్యర్థులు గెలుపొందే అవకాశాలున్నాయని ఎమ్మెల్యే అన్నారు.

కొత్తగూడెం మున్సిపాలిటీలో కూడా కూటమి నేతల ప్రయత్నాలు ఫలించలేదన్నారు. సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ఇంటింటికీ తీసుకెళ్లి ప్రచారం చేయడంలో సఫలీకృతులయ్యారు. దీంతో పట్టణ ఓటర్లు టీఆర్ఎస్ ప్రచారానికి బ్రహ్మరథం పట్టారు. రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, ఖమ్మం ఎంపీ నామా నాగేశ్వరరావు, మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డిలు మూడు మున్సిపాలిటీల్లో విస్తృత ప్రచారం నిర్వహించారు. సత్తుపల్లి మున్సిపాలిటీలో ఆ నియోజకవర్గ ఎమ్మెల్యే సంద్ర వెంకటవీరయ్య, వైరా మున్సిపాలిటీలో ఆ నియోజకవర్గ ఎమ్మెల్యే లావుడ్యా రాములునాయక్, మధిర మున్సిపాలిటీలో జిల్లా పరిషత్ చైర్మన్ లింగాల కమల్‌రాజులు ప్రధాన బాధ్యతలను నిర్వహించారు. ఇల్లెందులో ఆ నియోజకవర్గ ఎమ్మెల్యే హరిప్రియా నాయక్, కొత్తగూడెంలో ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావులు ప్రధాన ప్రచారాన్ని నిర్వహించారు. ఈ నెల 27న చైర్మన్ల ఎన్నికల పక్రియ జరగనుంది. అదే రోజు నూతన పా

నేడు తేలనున్న కొత్తగూడెం,ఇల్లెందు ఫలితాలు

ఈ రెండు పురపాలికలపై పాగా వేసేదెవరో

కౌంటింగ్‌కు పక్కగా ఏర్పాట్లు చేసిన అధికారులు

భద్రాద్రికొత్తగూడెం,జనవరి24 (ఆర్ ఎన్ఎ): మున్సిపల్ ఎన్నికలు ప్రశాంతంగా పూర్తి కావడంతో ఇప్పుడు అదే స్ఫూర్తితో ఈ నెల 25వ తేదీన కౌంటింగ్ ఏర్పాట్లు చేపట్టారు. ఉదయం 8గంటలకు ఓట్ల లెక్కింపు మొదలు పెట్టి మధ్యాహ్నాని కల్ల పూర్తి చేసేలా ఏర్పాట్లు చేశారు. ఇందుకోసం పటిష్ట పోలీస్ బందబస్తును కూడా చేపట్టారు. కౌంటింగ్ కేంద్రం వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుంది. జిల్లా కేంద్రంలోని సింగరేణి మహిళా కళాశాలలో కౌంటింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. 36 వార్డులకు గాను కౌంటింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసి అధికారులు అభ్యర్థులకు కౌంటింగ్ కేంద్రాల్లో తీసుకోవాల్సిన నియమ, నిబంధనలను ఇప్పటికే తెలియజేశారు. అభ్యర్థులతో పాటు ఏజెంట్లకు పాస్‌లను జారీ చేసే పక్రియను కూడా పూర్తి చేశారు. స్ట్రాంగ్ రూమ్‌ల్లో పటిష్ట భద్రత మధ్య ఉన్న బ్యాలెట్ బాక్సులు రేపు తెరుచుకోనున్నాయి. దీంతో బ్యాలెట్ బాక్సుల్లో నిక్షిప్తమైన అభ్యర్థుల భవితవ్యం తేలనుంది. ఉదయం 8 గంటలకు కౌంటింగ్ ప్రారంభ మై మధ్యాహ్నం రెండు, మూడు గంటల్లోపే ఫలితాలు వెలువడనున్నాయి. మున్సిపల్ ఎన్నికల ఓట్ల లెక్కింపు టేబుళ్ల వారీగా జరగనుంది. ప్రతీ వార్డు స్థానానికి ఒక టేబుల్‌ను ఏర్పాటు చేశారు. ముందుగా బాక్సులో 25 ఓట్ల చొప్పున లెక్కించి కట్టలు కట్టి 40 కట్టలను ఒక డ్రమ్ములో వేయనున్నారు. కట్టలను కలియతిప్పి లెక్కించడం జరుగుతుంది. ఒక టేబుల్‌కు ఒక సూపర్‌వైజర్, ఇద్దరు అసిస్టెంట్లను నియమించారు. అన్ని వార్డుల్లో ఒకే సారి లెక్కింపు జరుగుతుంది. కౌంటింగ్ కేంద్రంలో పార్టీకి ఒక్కరికి మాత్రమే పాస్ ఇవ్వడానికి నిర్ణయించారు. లెక్కింపు పూర్తయిన తరువాత మీడియా సెంటర్ ద్వారా ఫలితాలను వెల్లడించనున్నారు. ఉదయం 8 గంటల నుంచి 8.30 గంటల వరకు పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు జరగనుంది. మధ్యాహ్నం 3 గంటల వరకు కౌంటింగ్, సాయంత్రం వరకు ఫలితాలు వెలువడనున్నాయి.కొత్తగూడెంలోని సింగరేణి మహిళా డిగ్రీ కళాశాల, ఇల్లెందులోని సింగరేణి కమ్యూనిటీ హాల్‌లో బ్యాలెట్ బాక్సులను అధికారులు భద్రపర్చారు. అక్కడే ఓట్ల లెక్కింపు జరగనుంది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఓట్ల లెక్కింపు పక్రియకు అధికారులు ముందస్తు ఏర్పాట్లు చేసి భారీ బందోబస్తును ఏర్పాటు చేశారు. రాష్ట్ర ఎన్నికల సంఘం కూడా ఈ నెల 27న చైర్మన్, వైస్ చైర్మన్ పరోక్ష ఎన్నిక నిర్వహించాలని ప్రకటన జారీ చేసింది. ఎలాంటి క్యాంపు రాజకీయాలు లేకుండా ఈ పక్రియను నిర్వహించేందుకు తక్కువ సమయంలోనే ప్రమాణస్వీకారం చేయించాలని చెప్పడంతో పార్టీ శ్రేణులు సమాయత్తమవుతున్నారు.దీంతో అన్ని పార్టీల అభ్యర్థుల్లో ఉత్కంఠ నెలకొంది. మరికొద్ది గంటల్లో ఫలితాలు వెలువడనుం డటంతో తమ రాజకీయ భవిష్యత్తు ఏ విధంగా ఉండబోతుందోనని అభ్యర్థుల్లో ఆందోళన మొదలైంది. కొత్తగూడెం, ఇల్లెందు మున్సిపాలిటీల పరిధిలోని మొత్తం 133 వార్డులకు ఎన్నికలు జరిగిన విషయం విదితమే. కొత్తగూడెం, ఇల్లెందులో ఉన్న రెండు కౌంటింగ్ కేంద్రాల వద్ద పోలీస్ యంత్రాంగం పటిష్ట భద్రత కల్పించింది. శనివారం ఎన్నికల కౌంటింగ్ అనంతరం ఫలితాలను వెల్లడించేందుకు జిల్లా యంత్రాంగం అన్ని రకాల ఏర్పాట్లు చేసింది. కౌంటింగ్, ఫలితాలు వెలువడనున్న రెండు కౌంటింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్‌ను అమలు చేశారు. కౌంటింగ్ కేంద్రానికి వంద మీటర్ల దూరంలో పోలీస్ అవుట్‌పోస్టును ఏర్పాటు చేసి పాస్‌లు ఉన్న వారిని, కౌంటింగ్ ఏజెంట్లను, అభ్యర్థులను మాత్రమే కౌంటింగ్ కేంద్రంలోకి అనుమతించనున్నారు. కౌంటింగ్ కేంద్రాల ఏర్పాటును జాయింట్ కలెక్టర్ కర్నాటి వెంకటేశ్వర్లు, మున్సిపల్ కమిషనర్ అరిగె సంపత్‌కుమార్‌లు పర్యవేక్షించారు. ఫలితాలు వెలువడి అవుతున్న కారణంగా అన్ని రాజకీయ పార్టీలు ఉత్కంఠతో ఎదురుచూస్తున్నారు. మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థుల కళ్లు కాయలు కాసేలా ఎదురు చూస్తున్నారు. ఎన్నికల ఫలితాలు శనివారం వెల్లడి కానున్న నేపథ్యంలో సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. పట్టణ పరిధిలోని అన్ని వార్డుల్లో అభ్యర్థులు ఎవరికి వారు తామే గెలుస్తామని ధీమా వ్యక్తం చేస్తున్నారు. టీఆర్ఎస్ అభ్యర్థులు మాత్రం 36 వార్డుల్లో క్లీన్ స్వీప్ చేస్తామన్న ధీమాలో పై ఉన్నారు. ఎక్కడ చూసినా ఎన్నికల ఫలితాలపైనే చర్చ జరుగుతోంది. శనివారం ఉదయం నుంచి కౌంటింగ్ ప్రారంభమై మధ్యాహ్నం వరకు తుది ఫలితాలు వచ్చే అవకాశం ఉండటంతో పోటీ చేసిన అభ్యర్థుల్లో ఆందోళన నెలకొంది. కౌంటింగ్‌లో ఫలితం ఏ విధంగా ఉంటుందో అనే దానిపై అభ్యర్థులు తమ పార్టీ శ్రేణులు, నాయకులతో అంచనా వేస్తున్నారు. ఐదేళ్ల పట్టణ పాలకవర్గాన్ని ఎన్నుకునే ఫలితాలు కావడంతో ఈ ఫలితాలపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. తెలంగాణ ఏర్పడిన తరువాత తొలిసారిగా జిల్లాలోని రెండు మున్సిపాలిటీలకు ఎన్నికలు జరగడంతో ఈ మున్సిపాలిటీ పీఠాలపై ఎవరు పాగా వేస్తారన్న ఆసక్తి నెలకొంది.

ఏకశిల బీఈడీ కళాశాలలో ఓట్ల లెక్కింపు

కౌంటింగ్‌కు ఏర్పాట్లు పూర్తి

కౌంటింగ్ కేంద్రం వద్ద భారీ బందోబస్తు

జనగామ,జనవరి24(ఆర్ఎన్ఎ): మున్సిపల్ ఎన్నికల ఫలితాల లెక్కింపునకు జిల్లా అధికార యంత్రాంగం ఏర్పాట్లను పూర్తిచేసింది. ఉదయం 8గంటలకు లెక్కింపు మొదలు పెడతారు. లెక్కింపు కేంద్రం వద్ద భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఏకశిల బీఈడీ కళాశాలలో జనగామ మున్సిపల్ పరిధిలోని 30 వార్డుల ఓట్లను లెక్కించనున్నారు. ప్రతి టేబుల్ జరిగే ఓట్ల లెక్కింపు పక్రియను సీసీ కెమెరాల ద్వారా చిత్రీకరించడంతో పాటు వెబ్ విధానంతో ఎన్నికల సంఘం అధికారులు లైవ్ వీక్షించనున్నారు. లెక్కింపు కేంద్రం లోపల, బయట మూడంచల భారీ భద్రతను ఏర్పాటు చేస్తున్నారు. కౌంటింగ్ ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి తదితరలు పరిశీలించారు. ఉదయం 8 గంటల నుంచి ప్రారంభమయ్యే కౌంటింగ్ పక్రియకు అధికారులు సర్వం సిద్ధం చేశారు. జనగామ-హైదరాబాద్ జాతీయ రహదారిపై పట్టణ శివారులోని ఏకశిల బీఈడీ కళాశాలలోని నాలుగు గదుల్లో ఓట్ల లెక్కింపు జరుగుతుంది. రెండు గదుల్లో తొమ్మిది చొప్పున 18 వార్డులు, మరో రెండు గదుల్లో ఆరు చొప్పున 12 వార్డులు మొత్తం 30 వార్డులకు సంబంధించిన ఓట్లు లెక్కించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేశారు. రిటర్నింగ్ అధికారి, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారితోపాటు అభ్యర్థులు ఉండేలా ఏర్పాట్లు చేయడంతో పాటు టేబుళ్లపై కౌంటింగ్ పక్రియను దగ్గర నుంచి చూసేందుకు వీలుగా పోలింగ్ ఏజెంట్ల కోసం ప్రత్యేకంగా ఇనుప కంచతో ఫెన్సింగ్, గది మధ్యలో టేబుళ్లు, కౌంటింగ్ సిబ్బందికి కుర్చీలు ఏర్పాటుచేశారు. కౌంటింగ్ సిబ్బంది టేబుళ్ల వద్దకు ఎవరూ వెళ్లేందుకు వీలులేకుండా చుట్టూ భద్రత పరమైన కంచెను ఏర్పాటు చేశారు. కౌంటింగ్ ఏజెంట్లు శనివారం ఉదయం 7 గంటలకే కేంద్రం వద్ద రిపోర్టు చేయాల్సి ఉంటుంది. ఉదయం 8 గంటలకు ఒకేసారి 30 వార్డుల్లో కౌంటింగ్ పక్రియ మొదలవుతుంది. కౌంటింగ్ ప్రారంభమైన తొలి గంటన్నరలోనే అంటే ఉదయం 9.00 గంటల నుంచి ఆయా వార్డులో పోటీ చేస్తున్న అభ్యర్థుల బలాబలాల ట్రెండ్ మొదలై ఉదయం 11.30 గంటల వరకు మొత్తం అన్ని వార్డుల ఫలితాలు వెల్లడయ్యే అవకాశం ఉంది. కౌంటింగ్ కేంద్రాల్లోకి సెల్ కాగితాలు తీసుకుపోవడాన్ని నిషేధించారు. కౌంటింగ్ ఏజెంట్లకు ఇప్పటికే ప్రత్యేక గుర్తింపు కార్డులను జారీచేశారు. 8 గంటలకు కౌంటింగ్ మొదలైన తర్వాత తొలుత పోస్టల్ బ్యాలెట్లు లెక్కిస్తారు. 8.30 గంటలకు కౌంటింగ్ పక్రియను ప్రారంభిస్తారు. 9.30 గంటల నుంచి వార్డుల వారీగా అభ్యర్థుల బలాబలాలు వెల్లడికానుండగా, మొత్తం పక్రియ ఉదయం 11.30 గంటల వరకు పూర్తి కానున్నది. ప్రతి కౌంటింగ్ టేబుల్ వద్ద సూపర్ అసిస్టెంట్ సూపర్ మైక్రో అబ్జర్వర్ ఉంటారు. లెక్కింపు పక్రియ అంతా రాజకీయ పార్టీలు, ఏజెంట్ల సమక్షంలో సాగుతుంది. ప్రతి రౌండ్ ఫలితం వారికి తెలిపి నిర్ధారణ చేశాకనే వెల్లడిస్తారు.

మున్సిపల్ కౌంటింగ్‌కు పక్కాగా ఏర్పాట్లు

ఉదయం 8గంటలకు కౌంటింగ్ ప్రారంభం

గెలుపుపై ప్రధాన పార్టీల అంచనాలు

మెదక్,జనవరి24(ఆర్ఎన్ఎ): మున్సిపల్ ఎన్నికల ఫలితాలు శనివారం వెలువడనున్నాయి. ఈ మేరకు కౌంటింగ్‌కు పక్కగా ఏర్పాట్లు చేశారు. నాలుగు మున్సిపాలిటీల్లో ఓట్ల లెక్కింపు కేంద్రాల వద్ద పటిష్ట ఏర్పాట్లు చేశారు. కౌంటింగ్ కేంద్రాలకు పాసులున్న వారినే అనుమతిస్తారు. ఉదయం 8గంటలకు లెక్కింపు మొదలై మధ్యాహ్నానికి ఫలితాలు వెల్లడవుతాయి. ఫలితా కోసం ఎదురు చూస్తున్న అభ్యర్థుల్లో ఉత్కంఠ నెలకొంది. మెదక్ జిల్లాలోని నాలుగు మున్సిపాలిటీల్లో ఎక్కడ చూసినా ప్రస్తుతం ఫలితాలపైనే చర్చలు జరుగుతున్నాయి. ఆయా పార్టీల అభ్యర్థులు ఎవరికి వారు గెలుపుపై అంచనాలు వేసుకుంటున్నారు. జిల్లాలోని మెదక్, నర్సాపూర్, రామాయంపేట, తూప్రాన్ మున్సిపాలిటీలపై గులాబీ జెండా ఎగరడం ఖాయమని ఆపార్టీ నేతలు అంచనాలు వేస్తున్నారు. ఏకపక్ష విజయం ఖాయమని పార్టీ అధిష్టానం ధీమాగా ఉంది. మెదక్ అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో మెదక్, రామాయంపేట మున్సిపాలిటీలు, నర్సాపూర్ నియోజవర్గ పరిధిలో నర్సాపూర్ మున్సిపాలిటీ, సీఎం కేసీఆర్ ప్రాతినిధ్యం వహిస్తున్న గజ్వేల్ పరిధిలో తూప్రాన్ మున్సిపాలిటీ ఉన్నాయి. మెదక్, నర్సాపూర్ నియోజకవర్గాల్లోని ఎన్నికల బాధ్యతను పార్టీ అధిష్టానం ఎమ్మెల్యేలకు కట్టబెట్టింది. తూప్రాన్ మున్సిపాలిటీకి సంబంధించి ఫారెస్ట్ డెవల్‌పమెంట్ కార్పొరేషన్ చైర్మన్ వంటేరు ప్రతా?పరెడ్డి పర్యవేక్షిస్తున్నారు. పార్టీ అభ్యర్థుల విజయం కోసం మంత్రి సహా ఎమ్మెల్యేలు, పలువురు ముఖ్య నేతలు ముమ్మరంగా ప్రచారం నిర్వహించారు. మెదక్ మున్సిపాలిటీలో 32 వార్డులకు ఇప్పటికే టీఆర్ఎస్ రెండు వార్డులను ఏకగ్రీవం ద్వారా తన ఖాతాలో వేయించుకుంది. పోలింగ్ జరిగిన 30 వార్డుల్లో 22 నుంచి 25 చోట్ల గెలుస్తామని ఆ పార్టీ నేతలు భావిస్తున్నారు.

అదేవిధంగా తూప్రాన్‌లో 16 వార్డుల కుగానూ 12 వరకు వస్తాయని విశ్వాసంగా ఉన్నారు. అయితే మూడు నాలుగు చోట్ల పార్టీ రెబల్స్‌తో తీవ్ర పోటీ ఉండడం ఆ పార్టీ నేతలను కలవరపరుస్తోంది. నర్సాపూర్‌లో 15 వార్డుల్లో 10కి పైగా సాధిస్తామని పార్టీ నేతలు ధీమాగా ఉన్నారు. రామాయంపేటలో 12 వార్డుల్లో 8 నుంచి 10 వరకు గెలుస్తామని అధికార పార్టీ నాయకులు లెక్కలు వేస్తున్నారు. నాలుగు మున్సిపాలిటీల్లో మెదక్‌లోనే తమకు అనుకూల ఫలితాలు వస్తాయని కాంగ్రెస్ నేతలు భావిస్తున్నారు. 30 వార్డుల్లో 10 చోట్ల విజయం సాధించే అవకాశముందని అంచనా వేస్తున్నారు. ఎన్నికల ముందు చేరికల ప్రభావం మున్సిపల్ ఫలితాలపై ఏమేరకు ఉంటుందోనని పార్టీ నేతలు ఆందోళన చెందుతున్నారు. అవసరమైన చోట్ల బీజేపీ సహకారం తీసుకునే ఆలోచనలో ఉన్నారు. రామాయంపేట, నర్సాపూర్, తూప్రాన్‌లోనూ చెప్పుకోదగ్గ స్థాయిలో వార్డులు హస్తగతం అవుతాయంటున్నారు. బీజేపీకి మాత్రం నాలుగు మున్సిపాలిటీల్లో చైర్మన్లు, వైస్ చైర్మన్ల ఎన్నికల్లో తాము కీలకమౌతామని ఆ పార్టీ నేతలు లెక్కలు వేసుకుంటున్నారు. మెదక్, నర్సాపూర్‌లో కాస్త మెరుగైన ఫలితాలు వస్తాయని నమ్ముతున్నారు. స్వతంత్రుల మద్దతుతో ఇతర పార్టీలో పొత్తులు పెట్టుకుని కీలక పదవులను దక్కించుకునేలా పార్టీ నాయకులు ప్రణాళిక రచిస్తున్నారు. ఎంఐఎం పార్టీ మెదక్‌లో ఒక వార్డులో విజయంపై నమ్మకంగా ఉంది.

నేటి కౌంటింగ్‌కు ఏర్పాట్లు పూర్తి

ఉదయం 8గంటలకు లెక్కింపు మొదలు

కౌంటింగ్ కేంద్రం దగ్గర 144 సెక్షన్ అమలు

మహబూబ్‌నగర్,జనవరి24 (ఆంఎన్ఎ): శనివారం జరిగే మునిసిపల్ ఎన్నికల ఓట్ల లెక్కింపు కోసం అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేసింది. ఉదయం 8 గంటలకు కౌంటింగ్ పక్రియ ప్రారంభం కానుంది. ముందుగా పోస్టల్ బ్యాలెట్లను లెక్కిస్తారు. ఆ తరువాత బ్యాలెట్ ఓట్లను లెక్కించనున్నారు. పాలమూరు పట్టణంలోని బాలుర జూనియర్ కళాశాలలో మహబూబ్‌నగర్‌తో పాటు భూత్పూర్ పురపాలిక ఓట్లను లెక్కించనున్నారు. కౌంటింగ్ కోసం అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. గది మధ్యలో టేబుళ్లు ఏర్పాటు చేశారు. అధికారులు కూర్చోవడానికి కుర్చీలు వేశారు. కౌంటింగ్ ఏజెంట్లు, అభ్యర్థుల కోసం కౌంటింగ్ టేబుళ్ల చుట్టూ బారికేడింగ్‌లను ఏర్పాటు చేశారు. బారికేడింగ్‌లకు జాలీలను చుట్టూ కట్టారు. కౌంటింగ్ పక్రియను జాలీలోంచి పరిశీలించాల్సి ఉంటుంది. బ్యాలెట్ బాక్సులు భద్రపరిచిన స్ట్రాంగ్ రూంల వద్ద భారీ పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేశారు. కౌంటింగ్ వద్ద మూడంచెల భద్రతను ఏర్పాటు చేయనున్నారు. అనుమతి ఉన్నవారినే కౌంటింగ్ కేంద్రం వద్దకు అనుమతిస్తారు. ప్రతి వ్యక్తిని క్షుణ్ణంగా తనిఖీ చేసిన తరువాతే అనుమతించనున్నారు. కౌంటింగ్ కేంద్రం దగ్గర 144 సెక్షన్ అమల్లో ఉంటుంది. జిల్లా పోలీస్ అధికార యంత్రాంగమంతా కౌంటింగ్ కేంద్రం వద్దనే మోహరించనుంది.పాలమూరు పురపాలికలో 48 వార్డులకు ఎన్నికలు జరిగాయి. ఓట్ల లెక్కింపు కోసం 17 టేబుళ్లను ఏర్పాటు చేస్తున్నారు. ఒక రౌండ్‌లో 17 వార్డులకు సంబంధించిన ఓట్లను లెక్కిస్తారు. వార్డులోని 5 బూత్‌ల ఓట్లను ఒకచోట కలిపి, వాటిని బండిల్స్ కడతారు. ఆ తరువాత లెక్కిస్తారు. దాంతో ఒక రౌండ్‌లో 17 వార్డుల ఫలితాలు వస్తాయి. ఇలా మూడు రౌండ్లలో మొత్తం ఓట్లను లెక్కించనున్నారు. మొదటి రౌండ్‌లో 1 నుంచి 17 వార్డుల ఓట్లను లెక్కిస్తారు. రెండో రౌండ్‌లో 18 నుంచి 34 వార్డులు, మూడో రౌండ్‌లో 35 నుంచి 49 వార్డుల ఓట్లను లెక్కిస్తారు. భూత్పూర్‌లో 10 వార్డులు ఉండగా రౌండ్‌కు 3 వార్డుల చొప్పున మూడు రౌండ్లలో ఫలితాలను వెల్లడించనున్నారు. పాలమూరు పురపాలికలో తుది ఫలితాలు మధ్యాహ్నం మూడుగంటలకల్లా వెల్లడయ్యే అవకాశం ఉంది. పోస్టల్ బ్యాలెట్ ఓట్లను ముందుగా లెక్కిస్తారు. పాలమూరు పురపాలికలో 712 పోస్టల్ ఓట్లు నమోదుకాగా, భూత్పూర్ పురపాలికలో 27 నమోదయ్యాయి. 8 గంటలకు లెక్కింపును ప్రారంభిస్తారు.

గెలుపోటములపై పార్టీల అంచనాలు

నాలుగు మున్సిపల్ చైర్మన్ పీఠాల టీఆర్ఎస్ ధీమా

వికారాబాద్, జనవరి24(ఆర్ఎన్ఎ): జిల్లాలో నాలుగు మున్సిపాలిటీల చైర్మన్ అభ్యర్థులు ఎవరనేదానిపై ఉత్కంఠ నెలకొన్నది. ఉదయం కౌంటింగ్ పూర్తయితే ఎవరు విజేతలో తేలనుంది. 4 చైర్మన్ పీఠాలను కైవసం చేసుకుంటామని టీఆర్ఎస్ పూర్తి ధీమాతో ఉన్నది. స్థానిక ఎమ్మెల్యేలు ఇచ్చిన నివేదికల మేరకు చైర్మన్ అభ్యర్థుల ఎన్నికపై టీఆర్ఎస్ అధిష్టానం ఓ నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తున్నది. ఈ నెల 26న లేదా 27న అభ్యర్థుల పేర్లను ప్రకటించనున్నది. రేపు ఓట్ల లెక్కింపుతో అభ్యర్థుల భవితవ్యం తేలనున్నది. కాగా, గెలుపోటములపై ఎవరికివారు అంచనాలు వేసుకుంటున్నారు. పుర పాలకమండళ్ల తొలి సమావేశానికి ముహూర్తం ఖరారయ్యింది. ఈ మేరకు 27న తొలి సమావేశం జరుగనున్నది. అదే రోజు ఉదయం 11గంటలకు కౌన్సిలర్లతో ప్రమాణ స్వీకారం చేయించనున్నారు. అనంతరం మధ్యాహ్నం 12:30గంటలకు చైర్మన్, వైస్ చైర్మన్లను ఎన్నుకోనున్నారు. అదేరోజు చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికతో పాటు కౌన్సిలర్లతో ప్రమాణ స్వీకారం చేయించనున్నారు. 27న ఉదయం కౌన్సిలర్లుగా ఎన్నికైనా కొత్త సభ్యులతో ఉదయం 11గంటలకు ప్రమాణ స్వీకారం చేయించనున్నారు. జిల్లాలోని వికారాబాద్, తాండూర్, పరిగి, కొడంగల్ మున్సిపాలిటీల చైర్మ న్ అభ్యర్థులు ఎవరనే దానిపై జిల్లా అంతటా ఉత్కంఠ నెలకొంది. నాలుగు మున్సిపాలిటీల్లో చైర్మన్ పీఠాలను కైవసం చేసుకుంటామని పూర్తి ధీమాతో ఉన్న టీఆర్ఎస్ ఆయా మున్సిపాలిటీల్లో చైర్మన్ అభ్యర్థి ఎవరనేది స్థానిక ఎమ్మెల్యేలు ఇచ్చిన నివేదికల మేరకు ఇప్పటికే ఓ నిర్ణయానికి వచ్చారు.

బిజెపి సభలకు అనుమతి ఎందుకు ఇవ్వరు?

-నగర పోలీస్ కమిషనర్‌కు లక్ష్మణ్ ఫిర్యాదు

హైదరాబాద్,జనవరి24(ఆర్ఎన్ఎ): బీజేపీ బృందం హైదరాబాద్ పోలీస్ కమిషనర్‌ను కలిసింది. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి పోలీసులు కనీస గౌరవం ఇవ్వడం లేదని, నగరంలో బీజేపీ కార్యక్రమాలకు అనుమతి ఇవ్వడం లేదని ఫిర్యాదు చేసింది. ఎంఐఎం కార్యక్రమాలకు మాత్రం అనుమతిస్తున్నారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్ తీవ్రస్థాయిలో విమర్శించారు. అసద్ రెచ్చగొట్టేలా మాట్లాడుతున్నా పోలీసులు పట్టించుకోవడం లేదన్నారు. ఈ నెల 25న చార్మినార్ వద్ద ఎంఐఎం తలపెట్టిన ర్యాలీకి అనుమతి ఇవ్వొద్దని లక్ష్మణ్ అన్నారు. ఇలాగే వ్యవహరిస్తే సరికాదన్నారు. ఇదిలావుంటే సీఏఏ, ఎన్ఆర్‌సీకి వ్యతిరేకంగా యూఎంఏసీ, ఎంఐఎం ఈ నెల 25న అర్ధరాత్రి నిర్వహించ తలపెట్టిన సభకు అనుమతి ఇవ్వకుండా పోలీసులను ఆదేశించాలని కోరుతూ హైకోర్టులో వ్యాజ్యం దాఖలైంది. సభకు అనుమతిస్తే మత ఘర్షణలు చెలరేగే ప్రమాదం ఉందని పిటిషనర్ టి.ఉమామహేంద్ర తన వ్యాజ్యంలో పేర్కొన్నారు. యూఎంఏసీ, ఎంఐఎం ఈనెల 10న ప్రదర్శన, సభ నిర్వ హించాయని, 15 రోజుల వ్యవధిలో రిపబ్లిక్ డేకు ముందు అర్ధరాత్రి, మరోసభ, భారీగా జనసమీకరణకు ఏర్పాట్లు చేస్తున్నారని తెలిపారు. సభలో రెచ్చగొట్టే ప్రసంగాలు చేసే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.

దేశ సంస్కృతి, సంప్రదాయాలను గౌరవించాలి

యూత్ అవార్డుల ప్రదానోత్సవంలో గవర్నర్ తమిళ సై

హైదరాబాద్,జనవరి24(ఆర్ఎన్ఎ): దేశ సంస్కృతి, సంప్రదాయాలను గౌరవించాలని, దేశం కోసం ప్రతి పౌరుడూ పాటుపడాలని గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ సూచించారు. నాంపల్లిలోని ఇందిరా ప్రియదర్శిని ఆడిటోరియంలో 'ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్' పేరుతో నిర్వహించిన యూత్ అవార్డుల ప్రదానోత్సవంలో ఆమె పాల్గొన్నారు. నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతిని పురస్కరించుకొని యూత్ అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆధునిక జీవన శైలిని ఆస్వాదిస్తూనే సంప్రదాయాలను గౌరవించాలని గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ పిలుపునిచ్చారు. యువత ఏ రంగాన్ని ఎంచుకున్నా సంతోషంగా ముందుకు సాగాలని, నవభారత నిర్మాణం కోసం ఉత్సాహంగా పాలు పంచుకోవాలని ఆమె సూచించారు. అనుకున్న రంగంలో రాణించలేన ప్పుడు మరో రంగాన్ని ఎంచుకోవాలి తప్పా, ఆత్మహత్యలు లాంటి చర్యలకు పాల్పడరాదని ఆమె విజ్ఞప్తి చేశారు. సుభాష్ చంద్రబోస్ యువతకు ఇచ్చిన సందేశాలను గుర్తుచేస్తూ దేశం కోసం, జాతికోసం ప్రతి పౌరుడూ పాటు పడాలని, ఆయన జ్ఞాపకాలు యువతకు నిరంతరం స్ఫూర్తి అందిస్తూనే ఉంటాయని ఆమె తెలిపారు. సుభాష్ చంద్రబోస్ ఇండియన్ గవర్నమెంట్ సర్వీస్ పోటీ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించి 4వ స్థానంలో నిలిచినప్పటికీ స్వతంత్ర భారత్‌లో పని చేయడమే లక్ష్యంగా ఉద్యోగాన్ని వదులుకున్న గొప్పవ్యక్తి అని ఆమె కొనియాడారు. ఈ సందర్భంగా సుభాష్ చంద్రబోస్ చిత్రపటానికి పూలమాల వేసి ఆమె నివాళులర్పించారు.

కౌంటింగ్ కేంద్రాల వద్ద బందోబస్తు

ఉదయం నుంచే ఫలితాల వెల్లడికి ఏర్పాట్లు

నల్లగొండ,జనవరి24(ఆర్ఎన్ఎ): మున్సిపల్ ఎన్నికల కౌంటింగ్‌కు భారీ ఏర్పాట్లు చేశారు. కౌంటింగ్ ఏర్పాట్లను ఎస్పీ ఏవీ రంగనాథ్ పరిశీలించారు. జిల్లాలోని 7మున్సిపాలిటీల్లో కౌంటింగ్ కేంద్రాల వద్ద పూర్తి స్థాయిలో భద్రత చర్యలు తీసుకున్నామన్నారు. 25న జరుగనున్న ఓట్ల లెక్కింపునకు అధికార యంత్రాంగం ఆయా మున్సిపాలిటీల పరిధిలోని కౌంటింగ్ సెంటర్లలో ఏర్పాట్లు పూర్తి చేశారు.అభ్యర్థులు, పార్టీల నాయకులు శాంతిభద్రతల పరిరక్షణకు సహకరించాలన్నారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద అన్ని రకాల చర్యలు తీసుకున్నామన్నారు. ఈ నెల 25న కౌంటింగ్ ముగిసే వరకు బందోబస్తు ఉంటుందన్నారు. ఓట్ల లెక్కింపు కోసం తీసుకోవల్సిన జాగ్రత్తల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఇప్పటికే కౌంటింగ్ కేంద్రాల వద్ద అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని, ఉదయం 8 గంటల నుంచే ఓట్ల లెక్కింపు ప్రారంభం కానున్నట్లు తెలిపారు. ఓట్ల లెక్కింపునకు తగిన ఏర్పాట్లను ఇప్పటికే జిల్లా అధికార యంత్రాంగం పూర్తి చేసింది. నల్లగొండతో పాటు దేవరకొండ, మిర్యాలగూడ, హాలియా, నందికొండ, చండూరు, చిట్యాల మున్సిపాలిటీలలో 27న నూతన పాలకవర్గాలు కొలువు దీరనున్నాయి. కౌంటింగ్ అనంతరం ఫలితాలు ప్రకటించాక ఆయా మున్సిపాలిటీల్లో బలబలాలను దృష్టిలో పెట్టుకుని మెజార్టీ కౌన్సిలర్లు ప్రతిపాదించిన అభ్యర్థిని చైర్మన్‌గా, వైస్ చైర్మన్‌గా ఎన్నుకోనున్నారు. 2014 మార్చిలో మున్సిపల్ ఎన్నికలు జరగ్గా జూలైలో నల్లగొండ, మిర్యాలగూడ, దేవరకొండ మున్సిపాలిటీల్లో నూతన పాలకవర్గాలు ఏర్పడ్డాయి. వాటికి తోడు ఇటీవల జిల్లాలో హాలియా, నందికొండ, చండూరు, చిట్యాలను నూతన మున్సిపాలిటీలుగా ఏర్పాటు చేశారు. గత పాలకవర్గాల పదవీకాలం 2019 జులై 5వ తేదీతో ముగియడంతో ఆయా మున్సిపాలిటీల్లో ఇప్పటివరకు ప్రత్యేకాధికారుల పర్యవేక్షణలో పాలన సాగుతోంది.

టీఆర్ఎస్ చైర్మన్ అభ్యర్థుల ఖరారు

-నేటి కౌంటింగ్ తరవాత ప్రకటన

వికారాబాద్,జనవరి24(ర్ఎన్ఎ): జిల్లాలోని వికారాబాద్, తాండూర్, పరిగి, కొడంగల్ మున్సిపాలిటీల చైర్మన్ అభ్యర్థులకు సంబంధించి టీఆర్ఎస్ దాదాపు ఖరారు చేసింది. అయితే ఇప్పటికే పరిగి, కొడంగల్ మున్సిపాలిటీలకు సంబంధించి చైర్మన్ అభ్యర్థులు ఎవరనేది ఇప్పటికే స్పష్టత ఉండగా,...వికారాబాద్, తాండూర్ మున్సిపాలిటీల్లోనే చైర్మన్ అభ్యర్థులెవరనే దానిపై ఉత్కంఠ కొనసాగుతుంది. పరిగి టీఆర్ఎస్ మున్సిపల్ చైర్మన్ అభ్యర్థిగా ముకుంద అశోక్, కొడంగల్ మున్సిపల్ చైర్మన్ అభ్యర్థిగా జగదీశ్వర్‌రెడ్డి పేర్లు దాదా పు ఖరారు అయ్యాయి. తాండూర్ మున్సిపాలిటీ చైర్‌పర్సన్ రేసులో ఇద్దరు అభ్యర్థులు పోటీ పడుతున్నారు. దీపానర్సింలుతో పాటు తాటికొండ స్వప్నలు చైర్మన్ పీఠం కోసం తీవ్ర పోటీ పడుతున్నారు. తాండూర్ మున్సిపల్ చైర్‌పర్సన్ అభ్యర్థిగా దీపానర్సింహులు పేరునే పార్టీ అధిష్టానం ప్రకటించే అవకాశాలున్నట్లు టీఆర్ఎస్ వర్గాలు చర్చించుకుంటున్నారు. తాటికొండ స్వప్నను అభ్యర్థిగా ప్రకటింప జేసేందుకు కూడా ప్రయత్నాలు చేస్తున్నారు. పార్టీ అధిష్టానం ఇద్దరిలో ఒకరి పేరును ప్రకటిస్తారా లేదా ఒక్కొక్కరికి రెండున్నరేళ్ల చొప్పున చైర్‌పర్సన్‌గా అవకాశమిస్తారా అనేది మరో ఒకట్రెండు రోజుల్లో స్పష్టత రానుంది. మరోవైపు వికారాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ అభ్యర్థులుగా ఇద్దరు పో

బాలికా దినోత్సవం సందర్భంగా చైతన్య కార్యక్రమాలు

ప్రేరణతో అండగా నిలుస్తున్న కలెక్టర్

నల్లగొండ,జనవరి24(ఆర్ఎన్ఎ): జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా ఈ నెల 26 వరకు పలు కార్యక్రమాలను స్త్రీ, శిశు సంక్షేమ శాఖ చేపడుతోంది. బేటీ బచావో.. బేటీ పఢావో వంటి కార్యక్రమాలను ఇప్పటికే పలు దఫాలుగా చేపట్టిన అధికార యంత్రాంగా జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా జిల్లాలో ఈనెల 20 నుంచి 26 వరకు బాలికల సంరక్షణకు సంబంధించి పలు కార్యక్రమాలను నిర్వహిస్తోంది. డ్రాయింగ్, వ్యాస రచన పోటీలు నిర్వహించి ఆడపిల్లల వివక్షతపై పూర్తి స్థాయిలో అవగాహన వచ్చేలా చర్యలు తీసుకుంటున్నారు. తాజాగా.. 'ప్రేరణ' కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్ కార్యరూపం ఇచ్చారు. యుక్త వయస్సులో బాలికలకు ఎదురవుతున్న సమస్యలను అధిగమించే దిశగా బాలికలను చైతన్య పర్చేందుకు ప్రత్యేకించి సెల్ఫ్ డిఫెన్స్ తరగతులను పాఠశాలలు, కళాశాలల్లో నిర్వహిస్తున్నారు. బాలికలు చేరుకోవాల్సిన లక్ష్యాలను అధిగమించేలా అవగాహన కార్యక్రమాలను చేపడుతున్నారు. బాలికల రక్షణ కోసం ఉన్న చట్టాలు, శిక్షల గురించి అవగాహన కల్పిస్తున్నారు. ప్లలె ప్రగతి కార్యక్రమంలో కళాజాత ప్రదర్శనలు కూడా నిర్వహించారు.

సమాజంలో ఆడబిడ్డకు ఆదరణ కరువవుతోంది. మగ బిడ్డపై ఉన్న మోజు... ఆడ పిల్లలను సాకడం కష్టమన్న భావన నేపథ్యంలో వారిపై మమకారం సన్నగిల్లుతోంది. ప్రభుత్వం ఆడపిల్లల రక్షణకు అనేక కార్యక్రమాలు చేపడుతున్నా.. క్షేత్రస్థాయిలో అమలుకు నోచుకోవడం లేదు. పేదరికం కారణంగా కన్నపేగునే కాదనుకుంటున్న ఉదంతాలు నేటికీ జిల్లాలో పలు ప్రాంతాల్లో వెలుగు చూస్తూనే ఉన్నాయి. పట్టణాల్లో సైతం ఆడపిల్లలపై కన్నవాళ్ల ఆదరణ తగ్గుతూ వస్తుండటం విస్మయం గొలుపుతోంది. దీంతో జనాభా పరంగా మగ, ఆడ మధ్య భారీ వ్యత్యాసం కనిపిస్తోంది. ఈ సమస్యకు మూలాలను వెతికి పరిష్కరించే పనిలో జిల్లా అధికార యంత్రాంగం నిమగ్నమైంది. ఇటీవలే ఇన్చార్జి కలెక్టర్ చంద్రశేఖర్ ప్రేరణ కార్యక్రమానికి రూపకల్పన చేయగా.. దానికి అనుసంధానంగా మరిన్ని కార్యక్రమాలు చేపట్టేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు.

అత్యాధునిక స్కానింగ్ పరిజ్ఞానంతో ఆడపిల్ల అని నిర్ధారించుకొని గర్భస్థ శిశువును చిదిమేస్తున్నారు. భ్రూణహత్యల పరంపర నేపథ్యంలో జిల్లాలో ఆడపిల్లల నిష్పత్తి గణనీయంగా తగ్గుతోంది. జిల్లాలో ప్రతీ వెయ్యిమంది పురుషులకు 921 మంది స్త్రీలు మాత్రమే ఉన్నారు. తాజా జనాభా లెక్కల ప్రకారం... 0-6 వయస్సు మధ్య ఉన్న లెక్కలను పరిశీలిస్తే... రాష్ట్రంలో వరంగల్ జిల్లాలో అతి తక్కువగా బాలికలు ఉన్నారు. ఆతర్వాత స్థానంలో కడప జిల్లా ఉండగా, నల్గొండ జిల్లా మూడో స్థానంలో ఉంది. గిరిజన తండాల్లో ఆడపిల్లలపై ఉన్న వివక్షత కారణంగా పురిట్లోనే ఆడపిల్లలను చంపేస్తున్నారు.

లేదంటే అమ్ముకుంటున్నారు. నిరక్షరాస్యత, సరైన అవగాహనలేక గిరిజనులు ఈ చర్యలకు పూనుకుంటున్నారు. జిల్లావ్యాప్తంగా 200కు పైగా డయాగ్నస్టిక్ సెంటర్లు కొనసాగుతున్నట్లు అంచనా. డబ్బులకు ఆశపడి స్కానింగ్ సెంటర్ల నిర్వాహకులు చట్టాలను ఉల్లంఘిస్తూ అబార్షన్లను పరోక్షంగా ప్రోత్సహిస్తున్నారు. ఈ పరిస్థితుల నేపథ్యంలో జిల్లా ఎస్పీ రంగనాథ్ స్కానింగ్ సెంటర్లపై ప్రత్యేక నిఘా పెట్టారు. పోలీస్, ఇంటలిజెన్స్ల ద్వారా సమాచారాన్ని సేకరించి సంబంధిత స్కానింగ్ సెంటర్ల నిర్వాహకులపై కొరడా ఝుళిపిస్తున్నారు.

ఆల్ ఇండియావర్కింగ్ జర్నలిస్టుల డైరీని ఆవిష్కరించిన మంత్రి ఈటెల రాజేందర్‌ను సన్మానించిన జర్నలిస్ట్ నేతలు

మంత్రులకు సవాల్ కానున్న ఫలితాలు

కౌంటింగ్‌కు ఏర్పాట్లు పూర్తి

మహబూబ్‌నగర్,జనవరి24 (ఆర్ఎన్ఎ): ఉమ్మడి జిల్లాలోని 17 మున్సిపాలిటీల్లో ఎన్నికలు జరగ్గా వాటి కౌంటింగ్ వనివారం చేపట్టనున్నారు. శనివారం ఫలితాలు వెలువడనున్న తరుణంలో ఓటర్లు, అభ్యర్థులు అంతా ఎవరు గెలుస్తారనే అంశంపైనే చర్చించుకుంటున్నారు. మంత్రులు శ్రీనివాస గౌడ్,నిరంజన్ రెడ్డిలకు ఈ ఫలితాలు ప్రతిష్టగా మారాయి. వీరు తమ శక్తియుక్తులను కూడగట్టి ప్రచారం నిర్వహించారు. చాలా చోట్ల పెరిగిన, తగ్గిన పోలింగ్ శాతం ఫలితాలపై ప్రభావం చూపిస్తుందని అంచనా వేస్తున్నారు. 17 మున్సిపాలి టీల పరిధిలో మొత్తం కలిపి 78.51 శాతం మేర పోలింగ్ నమోదైంది. ఒక్క మహబూబ్‌నగర్ మినహా అన్ని చోట్లా 70 శాతం మేర పోలింగ్ దాటింది. 2014 ఎన్నికలతో పోలిస్తే ప్రస్తుతం పోలింగ్ శాతం పెరిగిందనే గణాంకాలు చెబుతున్నాయి. మహబూబ్‌నగర్, గద్వాలలో మినహా మిగతా పాత మున్సిపాలిటీ ల్లో పోలింగ్ శాతం పెరిగింది. ఈ లెక్కలు ఎలా ఉన్న అంతా నేటి కౌంటింగ్ పైనే దృష్టి పెట్టారు. వార్డులోని ఓటర్లలో ఎవరెవరు తమకు ఓటేసి ఉంటారో ఓ అంచనా వేసుకుని లెక్కలు రాసుకుంటున్నారు. ఫలానా ఫలానా వారు వేశారు కాబట్టి వారి అంచనాల మేరకు గెలుస్తామనే ధీమా వ్యక్తం చేస్తున్నారు. మరికొందరు అయితే ఓటర్లు మోసం చేశారని ఓటమి తప్పదేమోనని ఆందోళన చెందుతున్నారు. అన్ని పనులు చేసి పెట్టినా కొన్ని విషయాల్లో ఓటర్లను ప్రభావితం చేయలేకపోయామనే అభద్రత పోటీ చేసిన అభ్యర్థుల్లో కనిపిస్తోంది. అభివృద్ధి చేసే వారికి తప్పకుండా గెలుపు లభిస్తుందనే ధీమా వ్యక్తమవుతోంది. గెలుపుపై ఇప్పటికే పలుచోట్ల బెట్టింగులు జోరుగా సాగుతున్నాయి. పోలింగ్ సరళిని దగ్గరి నుంచి చూసి పలువురు నేతలు బెట్టింగ్‌లో పాల్గొంటున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో అందరి చూపు కౌంటింగ్ వైపే కనిపిస్తోంది. ఇన్నాళ్ల ఎదురుచూపులకు తెరదించుతూ శనివారం జరిగే కౌంటింగ్‌లో ఎవరు గెలుస్తారో ఎవరు ఓడతారో తెలిసిపోనున్నది.

నిజం మాట్లాడడం నేరం కాదు : కపిల్ మిశ్రా

న్యూఢిల్లీ, జనవరి 24 : ఈ నెల 23న భారతీయ జనతా పార్టీ నాయకులు కపిల్ మిశ్రా ట్వీట్ చేస్తూ.. ఫిబ్రవరి 8న ఢిల్లీ వీధుల్లో భారత్, పాకిస్తాన్ మధ్య పోరాటం జరగనుంది అని పేర్కొన్నారు. కపిల్ మిశ్రా ట్వీట్‌పై ఎన్నికల కమిషన్ దృష్టి సారించింది. ఆ ట్వీట్‌పై వివరణ ఇవ్వాలని నిన్న రాత్రి కపిల్ మిశ్రాకు ఎన్నికల కమిషన్ నోటీసులు జారీ చేసింది. ఎన్నికల కమిషన్ నోటీసులపై కపిల్ మిశ్రా స్పందించారు. తాను చేసిన ట్వీట్‌పై ఎన్నికల కమిషన్‌కు వివరణ ఇస్తానని ఆయన చెప్పారు. తాను తప్పు మాట్లాడనని అనుకోవడం లేదన్నారు. ఈ దేశంలో నిజం మాట్లాడడం నేరం కాదని మిశ్రా పేర్కొన్నారు. తాను నిజమే మాట్లాడను. తన ప్రకటనకు తాను కట్టుబడి ఉన్నానని కపిల్ స్పష్టం చేశారు. షాహీన్ బాగ్‌లో ఇప్పటికే రోడ్లను మూసివేశారు. ప్రజలను అనుమతివ్వడం లేదు. పాఠశాలలకు పిల్లలను పోనివ్వడం లేదు. దీనికంతటికి మనీష్ సిసోడియానే కారణమని కపిల్ మిశ్రా చెప్పారు.

నేటి అర్ధరాత్రి మహాపూజతో నాగోబా జాతర ప్రారంభం

ఆదిలాబాద్, జనవరి 24: ఆదివాసీల సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే ఆదిలాబాద్ జిల్లాలోని నాగోబా జాతర శుక్రవారం అర్ధరాత్రి ప్రారంభంకానున్నది. మెస్రం వంశీయులు మంచిర్యాల జిల్లా జన్నారం మండలం హస్తలమడుగు నుంచి పవిత్ర గోదావరి జలాలను తీసుకొని కాలినడకన నాలుగు రోజుల కిందట కెస్లాపూర్‌కు చేరుకున్నారు. నాగోబా ఆలయ పరిసరాల్లోని మర్రిచెట్ల కింద వారు సేదతీరారు. శుక్రవారం అర్ధరాత్రి సమయంలో మెస్రం వంశీయుల ప్రత్యేక పూజల అనంతరం జాతర ప్రారంభమవుతుంది. ఈ జాతరలో కీలకమైన ప్రజాదర్బార్ ఈనెల 27న జరుగనుండగా.. మంత్రులు, కలెక్టర్, వివిధశాఖల అధికారులు హాజరై గిరిజనుల సమస్యలకు పరిష్కారం చూపడం ఇక్కడి ప్రత్యేకత.

స్టార్ క్యాంపెయినర్ల జాబితాలో నా పేరు లేదు..

న్యూఢిల్లీ, జనవరి 24: ఫిబ్రవరి 8న ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఆప్, బిజేపీ, కాంగ్రెస్ పార్టీలు ఇప్పటికే ప్రచారంలో దూసుకెళ్తోన్న విషయం తెలిసిందే. అయితే కాంగ్రెస్ పార్టీ ఇప్పటికే స్టార్ క్యాంపెయిన్ల జాబితాను ప్రకటించింది. అయితే స్టార్ క్యాంపెయినర్ల జాబితాలో కాంగ్రెస్ సీనియర్ నేత సందీప్ దీక్షిత్ (ఢిల్లీ మాజీ సీఎం షీలా దీక్షిత్) పేరు లేదు. పార్టీ నేతలతో వచ్చిన కొన్ని విభేదాల కారణంగా స్టార్ క్యాంపెయినర్ల జాబితాలో తన పేరు లేదని ఈ సందర్భంగా సందీప్ దీక్షిత్ అన్నారు. ఈ విషయమై ఆయన మీడియాతో మాట్లాడుతూ..ఢిల్లీ కాంగ్రెస్‌ను ఏఐసీసీ స్థాయిలో పర్యవేక్షిస్తున్నారు. ఢిల్లీ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు సుభాష్ చోప్రాతో నేనే మి మాట్లాడలేదు. ఆయన దగ్గర నుంచి నాకు పిలుపు వస్తుందనుకోవడం లేదు. ఢిల్లీలో జరుగుతున్న సమస్యలపై నాకు అవగాహన లేదు. నేను పార్టీలో పెద్ద నేతను కాదంటూ పార్టీ అధిష్టానానికి చురకలంటించారు.

అక్రమాస్తుల కేసు..మాజీ ఎమ్మెల్యే అరెస్ట్

భువనేశ్వర్, జనవరి 24 :: అక్రమాస్తుల కేసులో బీజేడీ మాజీ ఎమ్మెల్యే అనమ్‌మాలిక్‌ను అవినీతినిరోధక శాఖ అధికారులు అరెస్ట్ చేశారు. 2014-19 మధ్య భవానీపట్న అసెంబ్లీ నియోజకవర్గానికి ఎమ్మెల్యేగా పనిచేసిన అనమ్‌మాలిక్ కు ఆదాయానికి మించి ఆస్తులు కలిగి ఉన్నట్లు అభియోగాలు నమోదు చేశారు. ఈ మేరకు అవినీతి నిరోధక శాఖ అధికారులు అనమ్‌మాలిక్‌ను అరెస్ట్ చేశారు. రాష్ట్రప్రభుత్వం జీరో కరప్షన్ (అనినీతి నిర్మూలన) ట్యాగ్‌లైన్ పాలసీ పెట్టుకున్న తర్వాత విజిలెన్స్ అధికారులకు పట్టుబడిన మొదటి బీజేడీ నేత అనమ్‌మాలిక్ కావడం గమనార్హం.

జనవరి 17న ఏసీబీ అధికారులు భవానీపట్న నక్టిగూడలోని అనమ్‌మాలిక్ ఇంటిపై దాడులు నిర్వహించారు. మదన్‌పూర్-రాంపూర్ పట్టణంలో ఉన్న ఆయన హోటల్‌లో కూడా తనిఖీలు నిర్వహించారు. మూడు భవంతులు, డూప్లెక్స్ ఇళ్లు, లిక్కర్ షాపు, మార్కెట్ కాంప్లెక్స్, 6 ప్లాట్లు గుర్తించి సీజ్ చేశారు. వీటి విలువ రూ.3.4కోట్లపైనే ఉన్నట్లు తేలింది. బ్యాంక్ ఖాతాలో రూ.49 లక్షలున్నట్లు గుర్తించారు.

బాలుడికి బ్లడ్ క్యాన్సర్.. అండగా నిలిచిన మంత్రి కేటీఆర్

నిజామాబాద్, జనవరి 24: జిల్లాలోని నందిపేట్ గ్రామంలో నిరుపేద కుటుంబానికి చెందిన నితిన్ అనే బాలుడు బ్లడ్ క్యాన్సర్ భారిన పడ్డాడు. చికిత్స నిమిత్తం నగరంలోని రెయిన్‌బోస్ చిల్డ్రన్స్ ఆస్పత్రి వైద్యులను సంప్రదించారు. చికిత్సకు రూ. 15 లక్షలు ఖర్చు అవుతుందని వైద్యులు వెల్లడించారు. నిస్సాహాయస్థితిలో ఉన్న కుటుంబ దుస్థితిని ఆర్మూర్ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి దావోస్ పర్యటనలో ఉన్న మంత్రి కేటీఆర్ దృష్టికి తీసుకువెళ్లారు. తక్షణం స్పందించిన మంత్రి కేటీఆర్ సీఎం సహాయ నిధితో పాటు ప్రభుత్వ పరంగా నిధుల మంజూరుకు ఆదేశాలు జారీచేశారు. మంత్రి ఆదేశాలతో ప్రభుత్వం తరపున రూ. 13 లక్షలు మంజూరు అయ్యాయి. ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి సంబంధిత చెక్కులను బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. ఆస్పత్రికి వెళ్లి బాలుడు నితిన్‌ను స్వయంగా పరామర్శించి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు.

వృద్ధాశ్రమం ముసుగులో మానసిక వికలాంగ కేంద్రం

మమత ఆశ్రమంపై కేసు నమోదు

మేడ్చల్,జనవరి24(ఆర్ఎన్ఎ): కీసర పోలీసు స్టేషన్ పరిధిలోని నాగారంలోని మమత వృద్ధాశ్రమంపై కేసు నమోదైంది. వృద్ధాశ్రమం పేరుతో మానసిక వికలాంగుల కేంద్రం నడుపుతున్నట్లు స్థానికులు గుర్తించారు. నిబంధనలకు విరుద్ధంగా కేంద్రాన్ని నిర్వహిస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు. ఇరుకైన గదుల్లో 73 మంది మానసిక వికలాంగులను ఉంచినట్లు పోలీసులు గుర్తించారు. అపరిశుభ్రత వాతావరణం మధ్యే మానసిక వికలాంగుల కేంద్రం నిర్వహిస్తున్నారు. మానసిక వికలాంగులను గొలుసులతో బంధించి కర్రలతో కొడుతున్నట్లు ఫిర్యాదులు అందాయి. ఒక్కో మానసిక వికలాంగుడికి రూ. 5 వేల నుంచి రూ. 10 వేలు వసూలు చేసినట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. సరైన వైద్య సదుపాయాలు కూడా కల్పించడం లేదని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. అనుమతి లేకుండా నిర్వహిస్తున్న నిర్వాహకులపై పలు సెక్షన్ల కింద పోలీసులు కేసు నమోదు చేశారు.

అర్ధరాత్రి మహాపూజతో నాగోబా జాతర ప్రారంభం

ఆదిలాబాద్,జనవరి24(ఆర్ఎన్ఎ)): ఆదివాసీల సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే ఆదిలాబాద్ జిల్లాలోని నాగోబా జాతర శుక్రవారం అర్ధరాత్రి ప్రారంభంకానున్నది. మెస్రం వంశీయులు మంచిర్యాల జిల్లా జన్నారం మండలం హస్తలమడుగు నుంచి పవిత్ర గోదావరి జలాలను తీసుకొని కాలినడకన నాలుగు రోజుల కిందట కెస్లాపూర్‌కు చేరుకున్నారు. నాగోబా ఆలయ పరిసరాల్లోని మర్రిచెట్ల కింద వారు సేదతీరారు. శుక్రవారం అర్ధరాత్రి సమయంలో మెస్రం వంశీయుల ప్రత్యేక పూజల అనంతరం జాతర ప్రారంభమవుతుంది. ఈ జాతరలో కీలకమైన ప్రజాదర్బార్ ఈనెల 27న జరుగనుండగా.. మంత్రులు, కలెక్టర్, వివిధశాఖల అధికారులు హాజరై గిరిజనుల సమస్యలకు పరిష్కారం చూపడం ఇక్కడి ప్రత్యేకత.

సమర్థవంతంగా కౌంటింగ్ నిర్వహణ :కలెక్టర్

వికారాబాద్,జనవరి24(ఆర్ఎన్ఎ): జిల్లాలోని మున్సిపల్ ఎన్నికల కౌంటింగ్ నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేశారు. దీనిని కూడా విజయవంతంగా పూర్తి చేయాలని కలెక్టర్ ఆయేషా నస్రం ఖాన్ సంబంధిత అధికారులకు సూచించారు. వికారాబాద్ మున్సిపల్ ఎన్నికల కౌంటింగ్ కేంద్రాన్ని ఎస్ఏపీ కళాశాలలో, తాండూరులోని సెయింట్ మేరినాట్స్ పాఠశాలలో, పరిగి, తాండూరు కౌంటింగ్ ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని ఏర్పాట్లు పూర్తి చేసామని అన్నారు. కౌంటింగ్‌ను శనివారం ఉదయం 8గంటలకు ప్రారంభించనున్నారు. పద్ధతి ప్రకారంగా కౌంటింగ్ టెబుల్స్ ఏర్పాటు చేసుకొని, సెంటర్లలో విద్యుత్ ఏర్పాట్లతో పాటు సిబ్బందికి ఆహారం, నీరు, మరుగుదొడ్ల ఏర్పాట్లు చేయాలని సూచించారు. అన్ని కౌంటింగ్ సెంటర్ల వద్ద జనరేటర్లు, సమకూర్చుకోవాలని సూచించారు. కౌంటింగ్‌కు సంబంధించిన అన్ని స్టేషనరీ వస్తువులు సమకూర్చాలని అధికారులకు తెలియజేశారు. కౌంటింగ్ హాలులో సెల్‌ఫోన్‌లకు అనుమతి లేదన్నారు. కౌంటింగ్ నిర్వహించే ఎన్నికల సిబ్బంది ఎలాంటి వత్తిడిలకు గురికాకుండా సమర్థవంతంగా పూర్తి చేయాలన్నారు.

అదరగొట్టిన రాహుల్, కోహ్లీ, అయ్యర్.. తొలి టీ20 భారత్‌దే

ఆక్లాండ్, జనవరి 24: కొత్త ఏడాది తొలి విదేశీ పర్యటనను టీమ్‌ఇండియా ఘన విజయంతో ఆరంభించింది. గతేడాది వన్డే ప్రపంచకప్‌లో సెమీఫైనల్లో ఓడించిన న్యూజిలాండ్‌ను వారి సొంతగడ్డపైనే ఓడించింది భారత్. గత కొన్నేండ్లుగా అన్ని ఫార్మాట్లలో ప్రతీ సిరీస్‌ల్లోనూ గెలుపొందుతున్న కోహ్లీసేన అదే జోరులో టీ20 సిరీస్‌ను అద్వితీయ గెలుపుతో మొదలెట్టింది. దీంతో ఆతిథ్య కివీస్‌తో ఐదు టీ20ల సిరీస్‌లో భారత్ 1-0తో ఆధిక్యంలో నిలిచింది. 204 పరుగుల భారీ లక్ష్య ఛేదనలో కేఎల్ రాహుల్(56: 27 బంతుల్లో 4ఫోర్లు,3 సిక్సర్లు), విరాట్ కోహ్లీ(45: 32 బంతుల్లో 3ఫోర్లు, 1సిక్స్), శ్రేయాస్ అయ్యర్(58 నాటౌట్:29 బంతుల్లో 5ఫోర్లు, 3సిక్సర్లు) పరుగుల సునామీ సృష్టించారు. దీంతో టీమ్‌ఇండియా ఒక ఓవర్ మిగిలుండగానే, 4వికెట్లు మాత్రమే కోల్పోయి 6 వికెట్ల తేడాతో ఘన విజయాన్ని సొంతం చేసుకుంది. కీలకసమయంలో ఒత్తిడిలో ఉన్న భారత్‌ను అయ్యర్, మనీశ్ పాండే(14 నాటౌట్) కలిసి విజయ తీరాలకు చేర్చారు. కివీస్ బౌలర్లలో ఇష్ సోధీ రెండు వికెట్లు తీయగా.. టిక్నర్, మిచెల్ సాంట్నర్ చెరో వికెట్ పడగొట్టారు. ఆరంభంలో రోహిత్ శర్మ(7) స్వల్ప స్కోరుకే పెవిలియన్ చేరినా బ్యాట్స్‌మెన్ సమష్టిగా రాణించింది.

అంతకుముందు టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన కివీస్ జట్టులో కోలిన్ మన్రో(59 42బంతుల్లో 6ఫోర్లు, 2సిక్సర్లు), కేన్ విలియమ్సన్(51 26 4ఫోర్లు, 4సిక్సర్లు), రాస్ టేలర్(54 నాటౌట్ 27 బంతుల్లో 3ఫోర్లు, 3సిక్సర్లు) అర్ధశతకాలతో రాణించడంతో నిర్ణీత ఓవర్లలో 5 వికెట్లకు న్యూజిలాండ్ 203 పరుగులు చేసింది. ఆరంభంలో ధనాధన్ బ్యాటింగ్‌తో అలరించిన కివీస్‌ను.. ఆఖర్లో భారత్ కట్టడి చేసింది. ఓపెనర్లు గప్తిల్, మన్రో, తమదైన శైలిలో వేగంగా ఆడటంతో తొలి ఐదు ఓవర్లలోనే కివీస్ 50కి పైగా పరుగులు రాబట్టింది. మొదట్లో కివీస్ జోరు చూస్తే అలవోకగా 230కి పైగా స్కోరు చేస్తుందని అనిపించింది.

కీలక సమయంలో శివమ్ దూబే.. గప్తిల్‌ను ఔట్ చేయడంతో భారత్ ఊపిరిపీల్చుకుంది. శివమ్ దూబే బౌలింగ్‌లో గప్తిల్ భారీ షాట్ ఆడగా బౌండరీలైన్ వద్ద ఫీల్డింగ్ చేస్తున్న రోహిత్ అద్భుత క్యాచ్‌తో భారత్‌కు తొలి వికెట్ దక్కింది. అనంతరం మన్రో బౌలర్లపై ఎదురుదాడికి దిగుతూ బౌండరీలతో విరుచుకుపడ్డాడు. అర్ధశతకం సాధించిన తర్వాత శార్దుల్ ఠాకూర్ వేసిన 12వ ఓవర్లో మన్రో.. చాహల్ చేతికి చిక్కాడు. స్వల్ప వ్యవధిలోనే మన్రో,గ్రాండ్‌హోం వికెట్లను చేజార్చుకున్న కివీస్‌ను విలియమ్సన్ కెప్టెన్ ఇన్నింగ్స్‌తో ఆదుకున్నాడు. ఆఖర్లో సీనియర్ బ్యాట్స్‌మన్ రాస్ టేలర్ మెరుపు బ్యాటింగ్‌తో విజృంభించడంతో 200 పరుగుల మార్క్‌ను చేరుకుంది. భారత బౌలర్లలో స్పీడ్‌స్టర్ బుమ్రా, స్పిన్నర్ చాహల్ ధాటిగా బంతులేస్తూ బ్యాట్స్‌మెన్‌ను కట్టడి చేశారు. బుమ్రా, శార్దుల్, చాహల్, దూబే, జడేజా తలో వికెట్ దక్కించుకున్నారు.

అమీన్‌పూర్ అత్యాచారం బూటకం

బాలిక కట్టుకథ అల్లిందన్న ఎస్పీ

సంగారెడ్డి,జనవరి24(నేటినిజం ప్రతినిధి): అమీన్‌పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో నిన్న బాలికపై అత్యాచారం జరిగిందని హల్ చల్ చేసిన వార్త అవాస్తవం అని జిల్లా ఎస్పీ చంద్రశేఖర్ రెడ్డి మీడియా సమావేశంలో వెల్లడించారు. పది రోజుల క్రితం పరిచయమైన సందీప్(24) అనే వ్యక్తితో ఆమె బైక్‌పై సినిమాకి వెళ్లి తిరుగు ప్రయాణంలో తల్లిదండ్రులకు భయపడి అత్యాచారం జరిగిందని స్టోరీ అల్లి తప్పుదోవ పట్టించిందన్నారు. అమ్మాయి ఫోన్ కాల్‌తో అప్రమత్తమైన తల్లి దండ్రులు, ఇంటి యజమాని రవిగౌడ్ సంఘటన స్థలానికి చేరుకొని తీసిన వీడియోలోని సన్నివేశాలు అన్నారు. మైనర్ బాలిక అల్లిన స్టోరీ వీడియోను తీసి వైరల్ చేసిన ఇంటి యజమాని రవిగౌడ్‌పై కేసు నమోదు చేసినట్లు చెప్పారు. అలాగే బాలికను సిమాకు తీసుకువెళ్లిన సందీప్‌పై పొక్సో చట్టం కింద కేసు నమోదు చేశామన్నారు. సీసీ ఫుటేజ్ ఆధారంగానే అమ్మాయి చెప్పిన విషయాలను విచారించి కేసు నమోదు చేశామని జిల్లా ఎస్పీ చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు.

క్యాన్సర్ బాధిత బాలుడికి సర్కార్ సాయం

కెటిఆర్ ఆదేశాలతో 13 లక్షలచెక్కు అందించిన ఎమ్మెల్యే

నిజామాబాద్,జనవరి24(ఆర్ఎన్ఎ): జిల్లాలోని నందిపేట్ గ్రామంలో నిరుపేద కుటుంబానికి చెందిన నితిన్ అనే బాలుడు బ్లడ్ క్యాన్సర్ భారిన పడ్డాడు. చికిత్స నిమిత్తం నగరంలోని రెయిన్‌బోస్ చిల్డన్స్ ఆస్పత్రి వైద్యులను సంప్రదించారు. చికిత్సకు రూ. 15 లక్షలు ఖర్చు అవుతుందని వైద్యులు వెల్లడించారు. నిస్సాహాయస్థితిలో ఉన్న కుటుంబ దుస్థితిని ఆర్మూర్ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి దావోస్ పర్యటనలో ఉన్న మంత్రి కేటీఆర్ దృష్టికి తీసుకువెళ్లారు. తక్షణం స్పందించిన మంత్రి కేటీఆర్ సీఎం సహాయ నిధితో పాటు ప్రభుత్వ పరంగా నిధుల మంజూరుకు ఆదేశాలు జారీచేశారు. మంత్రి ఆదేశాలతో ప్రభుత్వం తరపున రూ. 13 లక్షలు మంజూరు అయ్యాయి. ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి సంబంధిత చెక్కులను బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. ఆస్పత్రికి వెళ్లి బాలుడు నితిన్‌ను స్వయంగా పరామర్శించి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు.

రాళ్లదాడి నిజమే అన్న బండి సంజయ్

కరీంనగర్,జనవరి24(ఆర్ఎన్ఎ): తనకు గన్‌మెన్లు అవసరం లేదని ఎంపీ బండి సంజయ్ స్పష్టం చేశారు. తనపై రాళ్ళ దాడి జరిగిందని..

ఈ క్రమంలో పోలీసులకు కూడా గాయాలయ్యాయని వెల్లడించారు. కరీంనగర్ సీపీని తప్పుదోవ పట్టించారని.. డీజీపీకి వాస్తవ పరిస్థితిని తెలిపానన్నారు. విచారణ జరిపి వాస్తవాలు బయట పెట్టాలని బండి సంజయ్ డిమాండ్ చేశారు. కాగా.. బండి సంజయ్‌పై రాళ్ల దాడి జరగలేదని పోలీసులు తేల్చడంతో తనకు ప్రభుత్వం కేటాయించిన భద్రతా సిబ్బందితో పాటు వ్యక్తిగత భద్రతా సిబ్బందిని ఆయన తిరిగి పంపించిన విషయం తెలిసిందే.

కోలుకున్న స్టాక్ మార్కెట్లు

-సెంటిమెంట్ బలంతో లాభాలు

ముంబయి,జనవరి24(ఆర్ఎన్ఎ): వరుస నష్టాల నుంచి స్టాక్ మార్కెట్లు కోలుకున్నాయి. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి ప్రతికూల సంకేతాలు ఉన్నప్పటికీ దేశీయంగా దిగ్గజ కంపెనీలు రాణించడం మార్కెట్ సెంటిమెంట్‌ను బలపర్చింది. ఫలితంగా మూడు రోజుల తర్వాత సూచీలు లాభాలను దక్కించుకున్నాయి.సానుకూల త్రైమాసిక ఫలితాలతో యాక్సిస్ బ్యాంక్, ఇన్ఫోసిస్, ఎల్అండ్‌టీ తదితర షేర్లలో కొనుగోళ్లు వెల్లువెత్తాయి. ఈ అండతో గురువారం నాటి ట్రేడింగ్‌ను సూచీలు ఉత్సాహంగా ప్రారంభించాయి. 200 పాయింట్లకు పైగా లాభంతో ట్రేడింగ్‌ను ఆరంభించిన సెన్సెక్స్ రోజంతా అదే జోరు కొనసాగించింది. నేటి సెషన్ ముగిసే సమయానికి 271 పాయింట్లు ఎగబాకి 41,386 వద్ద స్థిరపడింది. అటు నిఫ్టీ కూడా 73 పాయింట్ల లాభంతో 12,180 వద్ద ముగిసింది. డాలర్‌తో రూపాయి మారకం విలువ 71.29గా కొనసాగుతోంది. ఎన్ఎస్ఈలో యెస్ బ్యాంక్, ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్, ఎల్అండ్‌టీ, భారత్ పెట్రోలియం, గెయిల్ షేర్లు రాణించాయి. యెస్ బ్యాంక్ షేరు విలువ దాదాపు 6శాతం పెరిగింది. దాదాపు అన్ని రంగాల షేర్లు లాభాల్లో ముగిశాయి. బీఎస్ఈ మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ 1శాతం వరకు లాభపడ్డాయి.

పప్పు నాయుడు రాజకీయ జీవితం ముగిసినట్టే. .!



అమరావతి, జనవరి 24: ఏపీ ప్రతిపక్షనేత, టీడీపీ అధినేత చంద్రబాబుపై వైసీపీ ఎంపీ విజయ సాయిరెడ్డి ట్విటర్లో మరోసారి మండిపడ్డారు. అమరావతి రాజధాని.. రియల్ ఎస్టేట్ ఆలోచనతోనే మూడు ప్రాంతాల గురించి ఎన్నడూ ఆలోచించలేదని, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి చంద్రబాబు అడ్డుపడుతున్నాడని విజయ సాయిరెడ్డి ఆరోపించారు.

'ఎన్టీఆర్ కు వెన్నుపోటు పొడిచే ప్రణాళికలో భాగంగా అప్పట్లో టీడీపీ నేత యనమల రామకృష్ణుడిని స్పీకర్ గా తెరపైకి తీసుకొచ్చాడు బాబు. బాస్ సీఎం కావడానికి స్పీకర్ స్థానంలో ఉండి ఆయన 'చరిత్రలో నిల్చేంత' సేవ చేశారు. ఇప్పుడు కౌన్సిల్ ఇమేజిని కూడా బాబు తన స్వార్థం కోసం మంట కలిపేశారు. అహంకారం, దుర్బుద్ధితో చంద్రబాబు వేసిన ఒక్కో తప్పటడుగు పార్టీని, నమ్ముకున్న వాళ్లని అధ:పాతాళానికి నెట్టి వేసింది. ఈ వయసులో శక్తికి మించిన విన్యాసాలు చేస్తున్నాడు. పప్పు నాయుడు రాజకీయ జీవితం కూడా ముగిసినట్టే. యనమల లాంటి తిరస